
పెద్ద కథ:

# ఉద్యోగాలు

శర్మ యం. ఏ. ప్యాసైనా అతనికి వట్టి అమాయకుడనే పేరు వచ్చింది. ఎందుకు వచ్చిందో మాత్రం అతనికి తెలియదు. అనేకమంది తనపట్ల ఆ పదాన్ని ప్రయోగించటం స్వయంగా విన్నాడు. ఒకళ్లు అనటమేమిటి? తన తల్లే పొరుగింటి బుచ్చమ్మతోటీ, మరుగింటి యశోదమ్మతోటి 'మావాడు వట్టి అమాయకుడమ్మా! నోట్లో నాలుకకూడా లేదు. ఎలా బ్రతుకుతాడో కాని.' అంటూవుండగా విన్నాడు. శర్మకి వళ్ళు మండింది ఒక్కసారిగా వాళ్ళ ముందుకు వెళ్ళి తన పొడుగాటి నాలుక చూపించి వాళ్ళ అనుమానం తీర్చివేద్దామనుకున్నాడు. కాని ఇంతలోకే వాళ్ల సంభాషణ మారిపోవటంవల్ల తనుకలుగజేసుకోవటమెందుకని వూరుకున్నాడు.



"కనీసం ఆ ముష్టివాణ్ణి పొమ్మనటమేనా చేతకాదా?" అన్నాడు తండ్రి.

వాళ్ళ నాన్న మరీ అన్యాయం తన మొహంమీదే ఆ మాట అనేకసార్లు అన్నాడు. తనేమీ అనలేక వూరుకున్నాడు.. ఒకళ్లలోవున్న ప్రయోజకత్వమేమిటో, తనలోవున్న అప్రయోజకత్వమేమిటో, ఎంత ఆలోచించినా అతనికి అర్థంకాలేదు.

అతను కొంతవరకు అందగాడే. ఏమైనా కురూపిమాత్రం కాడు. తనకంటె కురూపులెంతమంది లేరు? వాళ్ళనెవరూ అమాయకులని పిలవటంలేదు. పైగా తను యం. ఏ. ఫస్టుక్లాసులో ప్యాసయ్యాడు.

తను చేసిన తప్పల్లా, చదువు పూర్తికాకుండానే పెళ్ళిచేసుకున్నాడు. ఇది అందరూ కాకపోయినా ఈ దేశంలో చాలామంది చేసే తప్పే కాని ఇది తను ఒక్కడూ

జె. పరబ్రహ్మం

చేసింది మాత్రం కాదు. యం. ఏ. ప్యాసైనా తనకు వుద్యోగమేమీ రాలేదు. చాలమందికి రాలేదు. తనతో ప్యాసైన సహాధ్యాయబృందమంతా ఉద్యోగాలకోసం తనలాగే యెదురుచూస్తూ వున్నారు

అయితే తనకు ఒకళ్లను మోసంచేయటం చేతకాదు. చేతవునో కాదో, తనెప్పుడూ ప్రయత్నం చేయలేదు. అంత ఖచ్చితంగా అబద్ధాలు కూడా ఆడలేడు, చిన్నప్పుడు అబద్ధాలు ఆడటానికి ప్రయత్నించి తేలిపోయాడు. "లెక్కలు చేసేరా?" అని గద్దించేడు మాష్టారు.

"చేసేనండి" అని దబాయించిచెప్పేడు కిష్టిగాడు వాడుచెయ్యలేదని తనకు తెలుసు. తనుకూడా చేసేనని చెప్పేడు "నిజం చెప్పు వెధవా" అని ఒక్కదెబ్బ కొట్టేసరికి నిజం బయటపడింది దెబ్బ తిన్నందుకు కాకపోయినా, పదిమందిలోను తన అబద్ధం బైటపడినందుకు ఎంతో విచారించేడు.

కిష్టిగాడు మాత్రం తప్పించుకున్నాడు. స్కూలు వదలగానే కిష్టిగాడిదగ్గరకు వెళ్ళి "నా సంగతి యెవరో చెప్పేశారురా, మాష్టారుతోటి" అన్నాడు శర్మ.

"ఒకళ్లు చెప్పేదేమిటే, నీ మొహమే చెపుతూవుంటే' అన్నాడు వాడు. మొహం తడిమి చూసుకున్నాడు శర్మ. అప్పటినుంచి యిప్పటివరకు తన జీవితం ఒక మోస్తరుగానే నడుస్తోంది.

స్కూలు ఫైనలు పరీక్షలో అద్భుతమైన మార్కులు సంపాదించేడు శర్మ. ఏవో స్కూలు స్కాలర్షిప్పులుకూడా వచ్చేయి. తల్లీ, తండ్రీ గర్వపడ్డారు. "చాలా తెలివైన వాడు" అన్నారు మేష్టర్లు. దాంతో అమాయకుడనేమాట తాత్కాలికంగా మాసిపోయింది.

కాలేజీలో చేరేడు శర్మ. అక్కడ కూడా అతని ప్రతిభ దివ్యంగానే వెలిగింది. క్లాసులో ఫస్టుగా వుంటుండేవాడు. అంతే కాదు, యెంతో చమత్కారంగా మాట్లాడేవాడు. కాలేజీ డిబేట్లలో అనేక సార్లు బహుమానాలు కూడా సంపాదించాడు. "ఇతని వాక్స్థానంలో బృహస్పతి వుండి తీరాలి" అన్నాడు జ్యోతిష్యం తెలిసిన సంస్కృతం మాస్టారు.

ఈలోగా కాలేజీలో ఒక చిన్న సంఘటన జరిగింది. దాంతో అతని అమాయకత్వం, అతనిలో వుండే మిగతా విశేషాల్ని అణగ్రదొక్కి పైకి వచ్చేసింది. ఒకనాడు జూనియర్ కాలేజీలో అతనికొక పెన్ను దొరికింది. ఆ పెన్ను యెవరిదో అతనికి తెలుసు. అతని సహాధ్యాయిని లక్ష్మి అక్కడ వదిలి వెళ్లటం తను ప్రత్యక్షంగా చూసేడు. ఆమెను పిలిచి యిచ్చేద్దామనుకున్నాడు. కానీ నాలుక రాలేదు. త్వరగా వెళ్ళి యిచ్చేద్దామనుకున్నాడు. కాళ్ళు రాలేదు. చూస్తుండగానే ఆమె యింటికి వెళ్ళిపోయింది. పెన్ను మాత్రం తనదగ్గర మిగిలిపోయింది. మళ్ళీ నాడు కాలేజీ ప్రిన్సిపాలుకు ఆ పెన్నిచ్చి, ఫిజిక్సు లేబరేటరీలో ఫలానావాళ్లెవరో పెన్ను పారేసుకున్నారని, ఆనవాళ్ళు చెప్పి తీసుకోవచ్చునని, నోటీసు వేయించేడు. పెన్ను స్వస్థానానికి చేరింది. అయితే ఈవార్త శర్మ రూంమేట్సుకి తెలిసింది.

"ఆమెను పిల్చి యిచ్చివేయటానికి నీ కంతభయమెందుకోయి" అన్నాడు దాసు.

"నేనయితే ఆమెయింటికి వెళ్ళి స్వయంగా యిచ్చి 'థ్యాంక్సు' అనిపించుకొనివుండే వాడిని" అన్నాడు రామారావు.

"నీకోసమే స్వయంగా జారవిడిచి వుంటుంది" అన్నాడు వంద యెకరాల భూస్వామి ఏకైక సుపుత్రుడు సుబ్బారావు.

"అంతదూరం ఆలోచించే తెలివి తేటలు నాకు లేవు" అన్నాడు శర్మ.

"వట్టి అమాయకుడివి" అన్నాడు సుబ్బారావు.

చప్పట్లు కొట్టేరు అతని కాఫీ హోటల్ మిత్రులు.

శర్మ కాలేజీ జీవితం అంతా ఈవిధంగానే గడిచింది. యం. ఏ. ఫస్టుక్లాసులో ప్యాసయ్యేడు ఈ అమాయకుడు. చదువు పూర్తికాగానే ప్రతివారికీ వచ్చే సమస్యే అతనికీ వచ్చింది. ఏదో తన చదువుకుతగ్గ వుద్యోగం సంపాదించాలి. నిజానికి శర్మకు వెంటనే వుద్యోగం రాకపోయినా జీవితానికి పెద్ద యిబ్బందిలేదు. అతనితండ్రి ఆ వూళ్ళో పోస్టుమాష్టరుగా పనిచేస్తున్నాడు. అదికాక ఆ గ్రామంలో ఒక డాబా యిల్లు, పదియెకరాల భూవసతి వున్నాయి. అతనొక్కడే కొడుకు. అక్క



"ఇంతకంటె పనికివచ్చే పనేమిటో నీవే చెప్పరాదూ?" అన్నాడు. చంకలోవున్న పాపాయిని చూపించి "కాసేపు ఎత్తుకొని ఆడిస్తే వంటైనా త్వరగా అవుతుంది" అంది.

# ★ ఉద్యోగాలు ★

విశాలాక్షికి పెళ్ళైంది. అయితే ఇంటిలో తొందర ఎక్కువైంది.

"ఉద్యోగం పురుషలక్షణం" అంది అతని శ్రీమతి - రాజ్యం.

"ఉద్యోగం లేకుండా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటే ఏమి తోస్తుందిరా" అంది తల్లి.

"మీ అబ్బాయి ఏంచేస్తున్నాడంటే ఊరికేనే కూర్చున్నాడని చెప్పటానికి నామర్దాగావుంది" అన్నాడు తండ్రి.

అతని చదువు పూర్తికాకపూర్వమే వున్నా మనరకం ప్రాప్తించే ప్రమాదంకూడా తప్పిపోయింది.

అయితే వుద్యోగానికి శర్మ చేయవలసిన ప్రయత్నాలన్నీ చేస్తూనే వున్నాడు. ఇంగ్లీషు పత్రిక్కి నెలచందా కట్టేడు. ఒక్కటికూడా తప్పకుండా 'వాంటెడ్ కాలమ్సు' వెతుకుతున్నాడు. చదివి ప్యాసవటమంటే అతని చేతిలో వుందికాని వుద్యోగం అతని చేతులో లేదు. ఈ విషయాన్ని ఎవ్వరూ గ్రహించినట్లు లేరు.

"ఉద్యోగం వెదికే గట్టిప్రయత్నం చేయకూడదా" అంది ఒకరోజున ధర్మపత్ని.

"వీధిలోపడి వెదికితే దొరికే వస్తువనుకున్నావా యేమిటి?" అన్నాడు శర్మ.

"ఉహూ! ఇంటిలో కూర్చుంటేనే వచ్చి మీదపడే వస్తువు" అంది భార్య ఈసడిస్తూ.

ఏదోవిధంగా డబ్బు సంపాదిస్తే ఈబాధ తప్పుతుందనుకున్నాడు శర్మ. తను ఇంగ్లీష్‌లోను, తెలుగులోనూ కూడా చక్కగా వ్రాయగలడు. పత్రికలకు ఏవేవో కథలు వ్రాసి పంపితేకి తనకు కొద్దో గొప్పో డబ్బు వస్తుంది; పేరు వస్తుంది; ఇంటిలో పోరు తప్పుతుంది.

మర్నాడు ఉదయమే లేచి స్నానంచేసి కలం కాగితాలు ముందరవేసుకు కూర్చొని తదేకదీక్షతో వ్రాయటం మొదలుపెట్టేడు. కాసేపట్లో శర్మ పడే శ్రమ యేమిటో యింట్లోవాళ్ళందరకు తెలిసిపోయింది.

"పిడి వ్రాతల్ని పేపర్లో వేసుకొనే వెర్రివాళ్లు యెవరో?" అని నెమ్మదిగా గొణుక్కుంటూ అవతలకు వెళ్లేడు తండ్రి. విననట్లు నిర్లక్ష్యంగా వ్రాసుకుపోతున్నాడు శర్మ.

"బజారుకు వెళ్ళి కూరలేవేనా తీసుకురాకూడదురా అబ్బాయీ! ఈ పాడువ్రాత పెట్టుకుని కూర్చోకపోతే" అని సాగదీసుకుంటూ అంది తల్లి.

ఇంకాసేపటికి వంటింట్లోంచి శ్రీమతి కూడా విజయం చేసింది.

"ఇంతకంటే పనికొచ్చే పనేమీ లేదా?"

"ఇది యెందుకూ పనికిరాని పని అనా నీ వుద్దేశ్యం?" అన్నాడు గట్టిగా.

"ఆ మాట వేరే చెప్పాలా! మీరు చింపి క్రిందపారేస్తున్న కాగితాలు చూస్తే తెలియటంలేదూ?"

నెమ్మదిగా కలాన్ని దింపేడు శర్మ, ఆలోచిస్తూ.

"అయితే ఇంతకంటె పనికివచ్చేదేమిటో నీవే చెప్పరాదూ?" అన్నాడు.

చంకలోవున్న పాపాయిని చూపించింది భార్య. "కాసేపు యెత్తుకుని ఆడిస్తే వంటేనా త్వరగా అవుతుంది" అంది.

శర్మకి పట్టలేనంత కోపం వచ్చింది. తనంత పనికిరానివాడా? అయితే గట్టిగా మాటాడలేకపోయేడు. గట్టిగా మాట్లాడటం అతని స్వభావం కాదు.

"నేను ఈ పనికిరాని పనే చేయటానికి నిశ్చయించుకున్నాను." అన్నాడు కను బొమ్మలు చిట్లిస్తూ.

భార్య వదిలి వెళ్లేటప్పటికి, వీధిలో ఒక ముష్టివాడు తయారయ్యేడు. మొదట్లో నెమ్మదిగాను, దీనంగాను ముష్టి వేయమని అనేకవిధాల అడిగేడు. అంతకంతకూ స్వరం హెచ్చించి, మానవుల సమానత్వం మీద ఉపన్యాసం మొదలు పెట్టేడు. శర్మకి చికాకు యెక్కువైంది. బాకీవున్నట్టు అడుగుతున్నాడు. ముష్టివాడు పుట్టుకతోనే డబ్బు తీసుకొనిరామని, వెళ్ళిపోయేరోజున వెంటరాదని ఇష్టం వచ్చినట్లు పేలుతున్నాడు.

ఇంతలోనే తండ్రి గబగబా బయటనుంచి లోపలికి వచ్చేడు. వస్తూనే "కనీసం ఆముష్టి వాణ్ణి పొమ్మనటమేనా చేతకాదా?" అన్నాడు.

"చాతవటానికి, కాకపోవటానికి అదోక పెద్దవిద్యా యేమిటి?" అన్నాడు శర్మ నెమ్మదిగా.

అయితే గట్టిగా పొమ్మనటం అతని తత్వంలో లేదు. పైగా ఈరోజుల్లో ముష్టివాళ్ళను సమాధానపరచి పంపివేయటం ఒక పెద్దవిద్యే...ఈసంగతి శర్మకు తెలుసు.

భోజనానికి పిలుపు వచ్చింది. "భోజనం చేసి రాసుకోవచ్చులే, నీకథ యెక్కడికీ పోదు" అన్నారు యింట్లోవాళ్లు, నెమ్మదిగాలేచి మడికట్టుకున్నాడు శర్మ.

భోజనాలు కాగానే పోష్టుమాన్ ఒక కవరు తెచ్చి యిచ్చేడు. శర్మ వందలకొద్దీ పెట్టిన దరఖాస్తులలో ఒకదానికి సమాధానం అది. ఏదో మంచి ఉద్యోగం వచ్చిందనుకున్నారు. తీరాచూస్తే ఒకచిన్న బ్యాంక్‌లో ఒక చిన్న గుమాస్తా ఉద్యోగానికి ఇంటర్వ్యూకి మద్రాసు రమ్మని ఆహ్వానం. అసలే ఒక చిన్న బ్యాంక్. అందులో ఒక చిన్న గుమాస్తా! దానికో ఇంటర్వ్యూ!!

"ఐతే ఢిల్లీకివెళ్ళి వచ్చారన్నమాట...అక్కడ హిందీ భాష అర్థంకాక చాలా అవస్థలు పడి వుంటారనుకొంటా"

"ఆc...నా కేందుక వస్థ. పైగా నేను మాట్లాడేదేమిటో అర్థం చేసుకోలేక అక్కడి వాళ్లంతా బిక్కమొహాలు వేసి ఊరుకున్నారు.

—జి. వి. జి. కృష్ణ, మద్రాసు.

'హాలుడ్రీన్'
మలేరియాను తరిమివేయును
ICI
ICP 181

వెళ్ళనన్నాడు శర్మ.

వెళ్ళి తీరాలన్నాడు తండ్రి.

"ఇంతకంటే ఏశిక్ష వేసినా సరే" అన్నాడు శర్మ.

"ఈజీవితానికి ఈశిక్ష చాలు" అన్నాడు తండ్రి.

"ప్రయాణపు ఖర్చులుకూడా దండగే" అన్నాడు మళ్ళీ.

"అయితే గియితే నాకు దండగకాని నీకేం?" అన్నాడు తండ్రి.

"క్షమించమ"న్నాడు తను.

"ఎప్పుడూ క్షమిస్తూనే వున్నాను. వెళ్ళి తీరవలసిందే" అన్నాడు తండ్రి.

గత్యంతరంలేక ప్రయాణమయ్యేడు శర్మ. కావలసిన దుస్తులు సర్టిఫికేట్లు ఒక చేతి సంచీలో పెట్టుకున్నాడు. ఇంట్లో అందరూ ఉత్సాహంగా వున్నారు, అతను తప్ప.

*　　　*　　　*

మొత్తంమీద శర్మ మెద్రాసుకు టిక్కట్టు కొనుక్కొని రైలు యెక్కేడు. పెట్టె కొంచం ఇరుకుగానే వుంది. కాని బిక్కగా వున్న శర్మకు కూర్చునేందుకు సరిపోయిన జాగా లేకపోలేదు. అయితే జరిగి సర్దుకునేందుకు కూర్చున్నవాళ్ళెవరూ ఇష్టపడేటట్లు లేరు. ఒకవైపు వరుసలో ఒక యువకుడు కూర్చొని ఒక సినిమాపత్రిక చదువుకుంటున్నాడు. నల్లటి శరీరం, అంతకంటె నల్లని చలువ అద్దాలు, పెద్ద హైరోడ్డు క్రాపింగ్, ఆవారాబొమ్మల బుష్‌కోటు, నలిగిపోయిన తెల్లపాంట్, ఒక చేతిలో సిగరెట్టు, కొంచం సామాన్యులైనవారికి ఇద్దరికి సరిపోయే చోటు ఆక్రమించుకొని కూర్చున్నాడు.

తప్పకుండా అతడొక కాలేజీ విద్యార్థి అయివుంటాడనుకున్నాడు శర్మ. కారణమేమంటే చదువైన తర్వాత అటువంటి వేషం వేయటం అసంభవం.

"కొంచం చోటిస్తారా" అని నెమ్మదిగా సందేహిస్తూ ఇంగ్లీష్‌లో అడిగేడు.

"క్షమించాలి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్" అని అతి వెగటుగా నవ్వుతూ సమాధానం చెప్పాడు.

శర్మ నీరసంగా నేలచూస్తూ నిలబడ్డాడు.

కాలేజీ విద్యార్థికి యెదురుగావున్న వరుసలో ఒక ముసలాయన జాలిపడి శర్మకి కాస్త చోటిచ్చేడు. ఆ వరుసలోవున్న మిగతావాళ్ళు మాత్రం ముసలాడి దాతృత్వాన్ని లోలోపల నిందించుకుని, పైకి మాత్రం "పాపం యేదోలెండి, చాలాదూరం వెడుతున్నట్టున్నారు, కూర్చోనీయండి" అన్నారు.

[illegible]

లయ పర్వతమంత మని పెక్కేడు. శర్మకి యెదురుగుండావున్న వరుసలో తనంతట తనే కొద్దిస్థలం చిక్కించుకొని క్రమంగా యిటుప్రక్కవారిని అటుప్రక్కవారిని ఒక విదులుపు విదిల్చేడు. ఆ వత్తిడికి అవారా బుష్‌కోటు సీటు అవతలకి వెళ్ళిపడ్డాడు.

"చూడలేదు. క్షమించాలి" అన్నాడు పర్వతం.

"దాని కేమిలేండి. ప్రయాణాల్లో అందరూ ఓపిక పట్టాలి" అన్నాడు అవారా బుష్‌కోటు లేచి దుమ్ముదులుపుకుంటూ.

ఈ సమాధానం వినగానే శర్మకు నవ్వొచ్చింది. తను నిజంగా అమాయకుడే అనుకున్నాడు.

తర్వాత స్టేషన్లో ఒక గుడ్డివాడు యెక్కేడు. "ఏతీరుగ నను దయచూచెదవో" అంటూ వో పాట పాడి ముష్టివాడు డబ్బులు అడగటం మొదలుపెట్టేడు. కాని వాడి మొహాన్ని చూసేవాళ్ళు ఎవరూ లేకపోయేరు. శర్మ ఒక కానీ వేద్దా మనుకు



# ★ ఉద్యోగాలు ★

న్నాడు. అయితే సంపాదనలేని తనకు దానంచేసే అధికారం లేదని వూరుకున్నాడు. ముష్టివాడూ, మానవపర్వతం దిగిపోయారు. వాడి గుడ్డి సరియైనది కాదని, లేకపోతే కదిలే రైలును అంతచాకచక్యంగా యెక్కి దిగలేడని అవారా బుష్‌కోటు వ్యాఖ్యానించేడు. కొందరు 'ఔ'నట్లు నవ్వేరు. ముసలివాడు మట్టుకు "ఏదో బ్రదుకుతెరువుకోసం గుడ్డైనా, కుంటైనా ప్రాణాన్ని తెగించి వాడి పాట్లు వాడు పడుతున్నాడు" అన్నాడు. ఆ స్టేషనులోనే ఖద్దరు దుస్తులతో ఇంకొక వ్యక్తి యెక్కి పర్వతం ఖాళీచేసిన స్థలాన్ని భుక్తం చేసుకున్నాడు. అతని ప్రక్క జేబులో సమయానుకూలంగా ఉపయోగించుకునే నిమిత్తం ఒక ఖద్దరు టోపీ కూడా వుంది.

రైలుపెట్టె యెక్కిందిలగాయితు ఏకధాటీగా రాచకీయాలమీద ఉపన్యాసం చేస్తున్నాడు. ఐక్యరాజ్య సమితి మొదలు ఆంధ్రరాష్ట్రమువరకు గల సమస్తవిషయాలని తిరుగులేనిపద్ధతిలో చెప్పుకుపోతున్నాడు. శర్మకి తలనెప్పిగా వుంది. ఒక అరగంట తర్వాత రాచకీయ పండితుడు ఉపన్యాసాన్ని తాత్కాలికంగా ఆపేడు. ఎదురుగుండా కూర్చున్న శర్మని "ఒక బీడీ వుంటే యిస్తారా" అని అడిగేడు.

"నేను బీడీలు కాల్చను" అన్నాడు శర్మ ముఖం చిట్లించి.

"అయితే ఒక సిగరెట్టు యిప్పించండి" అని నవ్వాడు రాచకీయవేత్త. పెట్టెలోని వారుకూడా నవ్వేరు. శర్మ మాట్లాడలేదు. "నేను సిగరెట్టు తాగను" అన్నట్లయితే "ఇతడొక అమాయకుడు" అని వెంటనే లోకం సమాధానం చెబుతుందని అతని భయం.

మళ్ళీ రాచకీయవేత్త ఉపన్యాసం మొదలుపెట్టేడు ఎవరో యిచ్చిన బీడీ ముక్కని వెలిగించి. కాని యింతలో శర్మ వెనకనుంచి ఇంకొకస్వరం అతని వాదానికి ప్రతివాదం మొదలు పెట్టింది. ఇంకొక నిముషంలో పెట్టెలోనివారందరూ, కొందరిటూ కొందరటూ చేరిపోయారు శర్మా, శర్మకు చోటిచ్చిన ముసలివాడూ తప్ప. తన లాంటివాడు యింకొకడున్నందుకు శర్మ సంతోషించేడు. కాని వాడు ముసలివాడు. తనో - జీవితంలో, కొత్తగా ప్రవేశిస్తున్న ఒక యువకుడు.

అభిప్రాయాలు, విరుగుడుఅభిప్రాయాలు, వాదనలు ప్రతివాదనలతోటీ రైలు పెట్టి వేడెక్కిపోతోంది. వాగ్యుద్ధంలోంచి ముష్టియుద్ధంలోకి దిగేసూచనలు కనబడ్డాయి. "చిలికి-చిలికి గాలివాన అయ్యేటట్టుందే" అన్నాడు ముసలివాడు. శర్మకి యెక్కడలేని ధైర్యం వచ్చింది. వెంటనే లేచి నిలబడి "అయ్యా! మీలో కొందరు ఈదేశానికి మంత్రులయ్యే ప్రమాదం వుంది. కాబట్టి మీమీ అమూల్యమైన అభిప్రాయాల్ని యింత తేలికగా ఈ రైలుపెట్టెలో పారేయవద్దు" అన్నాడు.

వెంటనే పెట్టెలోనివారు శర్మవైపు చూసేరు. కాబోయే మంత్రులు చాలమంది తమ వాదనల్ని కట్టివేసేరు. శర్మ తెలివైనవాడేయని బొత్తిగా అమాయకుడు మాత్రం కాడని తెలుసుకున్నారు.

"మీ రేమి చేస్తున్నారు?" అన్నాడొకడు.

"ప్రయాణం చేస్తున్నాను" అన్నాడు శర్మ. అందరూ నవ్వేరు, శర్మకూడా నవ్వేడు. తర్వాత, తను యం. ఏ. ప్యాసైయ్యానని, ఉద్యోగంకోసం వెడుతున్నానని టూకీగా చెప్పేడు. అవారా బుష్‌కోటు ఒక్కసారి గుడ్లు మిటకరించి చూసేడు తనకంటె యెక్కువ చదివినవాడు ఇంకొకడు ఈ పెట్టెలోనే వున్నాడా! అన్నట్టు.

క్రమేపీ బయట చీకటి యెక్కువవుతోంది. ఒక్కొక్కళ్ళే వీలును చూసుకొని నడుములు వాల్చటం మొదలుపెట్టేరు ఆ యిరుకులోనే. అందులో కొందరు అనారోగ్యంగా వున్నట్టు తమ శరీర లక్షణాల్ని మార్చివేయటం మొదలుపెట్టేరు. అయితే ఒకరాత్రి యిరుకులో పడుకునే నిమిత్తమై రోగలక్షణాల్ని అభినయించటం 'అమాయకుడైన, శర్మకు తెలియదు. అవారా బుష్‌కోటు కూడా ఒడుంవాల్చి గాఢనిద్రని అభినయించటం మొదలుపెట్టేడు.

తర్వాత స్టేషనులో ఒక పదహారేళ్ల బిచ్చకత్తె యెక్కింది. 'అఖియ మిలాంకే... చెలె సహీ జానా!' అంటూ గొంతుక గొత్తింది మగస్వరంలో. నిద్రపోతున్న కుంభకర్ణులందరూ చివాలున లేచికూర్చున్నారు. పాటకత్తె చేతినిండా డబ్బులు వసూలు చేసుకుంది. అవారా తనకున్న ఎనిమిది జేబులు అతి అట్టహాసంగా వెదకి చివరకు ఒక రాగి డబ్బును పైకితీసి 'ఠంగ్' మని బిచ్చకత్తె చేతిలో వేసేడు.

శర్మ నవ్వుకున్నాడు. తనేనా అమాయకుడవ్వాలి లేదా ఈ ప్రపంచమేనా అమాయకమై వుండాలి. తనకు ఈ ప్రపంచానికి తేడామాత్రం వున్నట్టు గుర్తించుకున్నాడు.

అవారా బుష్‌కోటు మాత్రం శర్మతో బాగా పరిచయం వున్నవాడిలాగ మాట్లాడటం మొదలుపెట్టేడు. శర్మ యే కాలేజీలో చదివిందీ, ఏ యూనివర్సిటీలో చదివిందీ, యం. ఏ. లో యే క్లాసు వచ్చిందీ మొదలైన విషయాలన్నీ కూలంకషంగా అడిగి తెలుసుకున్నాడు. శర్మకి


కేసరి రత్నత్రయము

లోధ్ర

గర్భాశయ రోగ నివారిణి

స్త్రీలకు గలుగు ఋతుశూల, బహిష్ఠ కాకుండుట, అకాల బహిష్ఠ, మైల ఎక్కువగాను తక్కువగాను పోవుట, [illegible] రోగము సంతాన హీనత, రక్తహీనత, మలబద్ధము, సూతికావాతము, కీళ్ళ నొప్పులు, అరికాళ్ల, అరచేతుల మంట మొదలగు స్త్రీ మర్మవ్యాధులను కుదుర్చును.

అమృత

రక్తశుద్ధి ద్రావకము

ఇది రక్తహీనత, మలబద్ధము, అజీర్ణము, కీళ్ల నొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, విస్పత్తువ, కడుపులోమంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతిని ముఖమునకు తేజస్సును యిచ్చును.

అర్క

సర్వజ్వర నివారిణి

ఆహార, విహారఋతుభేద దోషంబుల వలన అన్నాశయమునందు క్రిమికూటము చేరి పలువిధములైన జ్వరములు సంభవించుచున్నవి. వాతజ్వరము, పిత్తజ్వరము కఫజ్వరము, సన్నిపాతజ్వరము మరి యితర విషమజ్వరములను, కడుపులోప్లీహమును జ్వరగడ్డను కుదుర్చును.

కేసరి కుటీరం
లిమిటెడ్

రాయపేట : మద్రాసు-14.

తెనుగుజిల్లాలకు, నైజాముకు ఏజంట్లు:

శ్రీ సీతారాం జనరల్ స్టోర్సు

బెజవాడ, సికింద్రాబాదు.

మాట్లాడటం యేమాత్రం యిష్టం లేకపోయినా వాడడిగిన ప్రశ్నలకు ముభావంగా సమాధాలు మాత్రం చెప్పేడు. తర్వాత అవారా, చలంగారి రచనలు, ఎంకి పాటలు వగైరాలమీద తనకుతోచిన వ్యాఖ్యానాలు చేసి కేవలం రాచకీయాల్లోనే కాకుండా సాహిత్యంలో కూడా తనకు ప్రవేశం వున్నట్టు ఋజువుచేసుకున్నాడు. తరువాత మద్రాసులో ఏదో కాలేజీలో చదువుతున్నానని కొంత స్వీయచరిత్రకూడా చెప్పకున్నాడు. శర్మ మాత్రం మౌనంగా కూర్చుని వింటున్నాడు. తిరుగు ప్రశ్నలు వేయలేదు. ఒకరు చెప్పే విషయాలు తనకు సంబంధం లేనంతవరకువిని వూరుకోవటమే కాని వాడు నిజం చెబుతున్నాడా, లేదా, కాలేజీలో చదువుతున్నాడా లేదా, మొదలైన విషయాల్లో ఆరా తీయాలనే ఆసక్తి అతనికి లేదు.

రైలు సూళ్ళూరుపేట చేరింది. అవారా బుక్‌కోటు 'టీ' అమ్మకునేవాణ్ణి పిలిచి 'రెండు టీ' అన్నాడు. ఒక కప్పుతీసుకొని శర్మకి అందించబోయేడు. శర్మ తన కక్కర్లేదన్నాడు.

"పరవాలేదు. తీసుకోండి"

"పర్వాలేని మాట వాస్తవమే కాని మొహం కడుక్కోకుండా కాఫీ టీలు త్రాగే నాగరికత నాకింకా అలవాటు కాలేదు" అన్నాడు శర్మ.

"మీరు చాలా ఖచ్చితమైన మనుష్యులు కుమండీ" అన్నాడు అవారా.

అంతవరకు సంతోషించేడు శర్మ, టీ యిచ్చినా పుచ్చుకోని తన్ను ఒక అమాయకుడి క్రింద జమకట్టనందుకు.

మిగతా ప్రయాణం ఆట్టే విశేషాలు లేకుండానే జరిగింది. మెడ్రాసు రాగానే యిద్దరు దిగిపోయారు. వెళ్ళిపోతూ "గుడ్ బై-మిత్రమా!" అన్నాడు అవారా—

"వీడా నా మిత్రుడు!" అనుకున్నాడు శర్మ. కాని మాట్లాడలేదు.

"కాస్తదూరం నడిచి మళ్ళీ వెనక్కు తిరిగి "తప్పులుంటే క్షమించండి" అన్నాడు అవారా.

"శిరస్సు మొదలు పాదాలవరకు యెంత వెదికినా ఒక్క తప్పుకూడా నాకు కనబడ లేదు" అన్నాడు శర్మ.

బిగ్గరగా నవ్వి వెళ్ళిపోయేడు అవారా.

అక్కడితో అవారాపీడ వదలినందుకు సంతోషించేడు శర్మ.

* * *

స్నానాలు పానాలు ఒక హోటల్లో ముగించి ఇంటర్వ్యూకి నిర్దేశించబడిన స్థలానికి వేళకు కొంచెము ముందుగానే జేరుకున్నాడు శర్మ. అయితే బ్యాంక్ డైరెక్టర్లలో ఒకరికి వేరేపని వుండటంవల్ల బెంగుళూరు వెళ్ళేరని అందరిడైరెక్టర్ల సమక్షంలోమాత్రమే ఇంటర్వ్యూ జరగవలసి వుందని అందుచేత అభ్యర్థులు రెండురోజుల తర్వాత మళ్ళీ రావలసివుంటుందని అక్కడ తెలియజేసేరు. కాళ్ళీడ్చుకుంటూ హోటలు జేరి ఈసంగతి తండ్రికి వ్రాసేడు. ఒక డైరెక్టరు వూళ్ళోలేడని అతడు వచ్చేవరకు ఇంటర్వ్యూలు జరగవని అతడు రెండు మూడురోజుల్లో తిర్గి రాగలడని బ్యాంకు


అసలైన

గొల్లభామ మార్కు

పాలగుర్తు

ఉత్తమమైన వాటిని కొనటం ప్రయోజనకరమని జీవితంలో మనకు త్వరలోనే తెలిసివస్తుంది. శ్రేష్ఠమైన సరుకు కోసం కొంచెం అదనంగా అయ్యేపెబ్బు సద్వినియోగమే అవుతుందని మన తలిదండ్రులు యెరిగియుండిరి, మనకూ తెలుసు. కాబట్టి గొల్లభామ మార్కు పాలు అనేక దశాబ్దాలుగ భారత దేశంలో ఏరి, కోరి వాడబడుతున్నది. ప్రజాభిమానం చూరగొన్న ఈ పాలు అట్టి అభిమానానికి పాత్రమయేట్లు తయారు చేయబడ్డవి.




ఆ అదనపు దమ్మిడీల విలువ గ్రహించండి.

ఉత్తమమైన వాటినే కొని వాటిని సద్వినియోగం చెయ్యండి

★

వివరములు తెల్పు కరపత్రం కోసం హూకు వ్రాయండి!

నెసిల్స్ ప్రాడక్ట్సు

(ఇండియా) లిమిటెడ్,

పో. బా. నం. 180, మద్రాసు - 1.

# ★ ఉద్యోగాలు ★

దగ్గర చెప్పినప్పటికీ తనకుమాత్రం అనమ్మకం లేదని, ఆ పరిస్థితులలో ఇంటికి తిరిగిపోవటం ఉత్తమమని వ్రాసేడు.

రెండోరోజున తండ్రిదగ్గర నుంచి హోటలు-చిరునామాకు రెండుకవర్లువచ్చేయి. శర్మ వ్రాసిన ఉత్తరం అంది సంగతులు తెలిసినవనిన్నీ, ఇంటిదగ్గర మిగిలిపోయే పనులేవీ లేవనిన్నీ రెండుకాకపోతే నాలుగు రోజులైనాసరే ఇంటర్వ్యూ జయప్రదంగా ముగించుకుని మాత్రమే తిరిగి రావలెనని వ్రాసేడాయన. రెండో కవరులో (ఒక పెద్ద కంపెనీ) లెక్కల తనిఖీ డిపార్టుమెంటులో ఒక వుద్యోగానికి ఇంటర్వ్యూ కార్డు వచ్చిందనిన్నీ, ఆ వ్యవహారంకూడా చూసుకొని రమ్మనమనివుంది. ఇంటర్వ్యూ కార్డుకూడా అందులోనే జతపర్చి వుంది.

తండ్రిశాసనం అంత కఠినంగావున్నప్పుడిక తను చేయగల్గిందేమీ లేదనుకున్నాడు. ఈమానవలో కొన్ని తప్పించుకుని తిరుగుతూ నాలుగు రోజులు ఆ హోటల్లోనే యెల్లాగో గడిపేడు. అదృష్టవశాత్తు బ్యాంకు ఇంటర్వ్యూ అయిన మర్నాడే లెక్కల తనిఖీ డిపార్టుమెంటుకు ఇంటర్వ్యూ.

వేళకు ముందుగానే బ్యాంకుకి జేరుకున్నాడు. అప్పటికప్పుడే అభ్యర్థులు చాలా మంది అక్కడ సమావేశమైవున్నారు. వాళ్ళందరూ రంగురంగుల నెక్ టైలు వాళ్ళ వాళ్ళ తాహతునుబట్టి ట్వీడ్, సిల్కు అనావా మొదలైన సూట్లు వేసుకొని నిండుగా వున్నారు. వాళ్ళని చూడగానే శర్మకి వణుకుపుట్టింది. కనీసం పి. హెచ్ డి. డి. లిట్ లు సంపాదించినవాళ్ళై యుంటారనుకున్నాడు. తనొక లాల్చీ ఒక పంచి, కండువా వేసుకొని వచ్చేడు. అవేనా పూర్తిగా మాసిపోయివున్నాయి. మెడ్రాసు మకాం ఒక్కరోజే అనుకొని ఒక జత దుస్తులతో తను వచ్చేడు. తీరా అక్కడ నాలుగురోజులు ఆగవలసివచ్చింది. పరిస్థితులన్నీ తనకి పూర్తిగా వ్యతిరేకంగా వున్నట్టు కనబడ్డాయి. వాళ్లందరూ తన్ను చూసి నవ్వుతున్నారేమో అనిపించింది. వాళ్ల ముఖాలనుంచి తన దృష్టిని తప్పించుకుంటూ అక్కడున్న బల్లమీద కూలబడ్డాడు. ఇంటర్వ్యూకి ఇంకొక గంట టైముంది. "ముంచుకుపోయినటు అంత ముందరగా యెందుకు వచ్చానా!" అనిపించింది. చుట్టూవున్న జనాభాని ఒక్కసారి చూసేడు. చాలామంది జేబుల్లో స్కూలు ఫైనల్ రిజిష్టర్లు ఎత్తుగా కనిపించేయి. ఒక్కసారి ఆశ్చర్యం ధైర్యం వచ్చాయి. కేవలం వేషంతో యెంతో మోసం చేయవచ్చునని తెలుసుకున్నాడు. ఎవరు యెంతెంత ఘనులో తెలుసుకుందామని ఒకరి రిజిష్టర్లు ఒకరు చూచుకోవటం మొదలుపెట్టారు. చాలమంది రిజిష్టర్లు పూర్తిగా నిండిపోయి వున్నాయి. అందులో యే వొక్కడూ దండయాత్రలు చేయకుండా ప్యాసైనవాడు లేడు.

ఆ గుంపులోని ఒకడు శర్మని "నీ రిజిష్టరేది?" అని అడిగేడు.

"నాకు రిజిష్టరు లేదు."

"స్కూలుఫైనల్ ప్యాసైతే కాని ఉద్యోగం యివ్వరు" అన్నాడు వాడు సగర్వంగా.

"కనీసం చదివేనా ఉండాలి" అన్నాడు రెండోవాడు. బహుశా వాడింకా ప్యాసై వుండడు.

నెమ్మదిగా శర్మ సంచీలోంచి తన పట్టాని బయటపెట్టేడు. ఒక్కసారి వాళ్లందరకూ మూర్ఛవచ్చినంత పనైంది. శర్మనీ, శర్మ డిప్లొమానీ చూడటం తప్ప మరేం మాట్లాడలేకపోయారు. చివరకు అందులో ఒకడు ధైర్యంచేసి

"మీ రేమిటీ, మీ చదువేమిటీ! ఈ వుద్యోగానికి రావటమేమిటీ!!" అన్నాడు ఆశ్చర్యంగా.

"నిజమే" అనుకున్నాడు శర్మ. "తన



చదువేమిటీ, ఈ వుద్యోగానికి రావటమేమిటి!" బలవంతముగా పంపిన తన తండ్రిమీద యెంతేనా కోపము వచ్చింది. అసలు తప్పంతా తనదే. "ఇంతోటి ఉద్యోగానికి తను దరఖాస్తుచేయటం ఎందుకూ?"

దూరాన్నుంచి అవారా రొప్పుకుంటూ గబగబా వస్తున్నాడు. అయితే అవారా బుష్‌కోటు మాత్రం లేదు. సూటు, నెక్‌టైతో అతి అట్టహాసంగా వున్నాడు.

"కొంపతీసి వీడుకూడా యీవుద్యోగానికే కాదుకదా!" శర్మని చూడగానే అవారా ఆశ్చర్యపోయేడు. దూరంగానే నిలబడిపోయి ముందుకు వెడదామా వద్దా, అన్నట్లుతటపటాయిస్తున్నాడు. శర్మకూడా ఈవుద్యోగానికే వస్తున్నాడని వాడూహించుకొని వుండడు. శర్మ యిక యేమైనా అక్కడ వుండకూడదనుకున్నాడు. వీళ్లతోటి పోటీచేయటం బుద్ధి తక్కువ పని అనిపించింది. ఇంటిదగ్గర వాళ్లు తన్ను యేమన్నాసరే అని ధైర్యంచేసి లేచేడు. అయినా రేపు యింకో ఇంటర్వ్యూవుండనే వుంది. ఆ ఇంటర్వ్యూ సంగతేదో చూసుకోవచ్చును. అందుచేత మద్రాసు రావటం పూర్తిగా దండగమాత్రం కాదు. ఇంటిదగ్గర వాళ్ళ నేదోవిధంగా సమాధానపరచవచ్చును. ఒకవేళ వాళ్ళను సమాధానపరచలేకపోయినప్పటికీ, దానివల్ల వచ్చే పరిస్థితి యింతకంటె విషమంగా వుండదు. ఈ నిశ్చయంతోటే శర్మలేచి నడక సాగించేడు.

"వెళ్ళిపోతున్నా రేమిసార్" అన్నాడు ఆ గుంపులోంచి ఒకడు. "చిన్న పని వుంది" అని వెనక్కి చూడకుండానే ముందుకు సాగిపోయేడు. అయితే దూరంగావున్న అవారాని చూడనట్టునటించి వెళ్ళిపోయేడు.

దారిలో ఒక సన్‌లైటు సబ్బు కొనుక్కొని హోటలుకు చేరి సంచీలోంచి పూర్తిగా మాసిపోయిన ఒకజరీఅంచుపంచీ, కండువా ఒకచొక్కాని తీసి తెల్లగా వుతుక్కున్నాడు. ప్రక్కనే వున్న లాండ్రీ షాపుకువెళ్ళి వాటిని ఇస్త్రీ చేయించుకున్నాడు.

మళ్ళీ రోజున ఇంటర్వ్యూకి కచ్చితంగా టైముకి వెళ్లేడు. నిన్న జరిగిన పొరపాట్లు ఈసారి జరగకూడదనుకున్నాడు. ఇక్కడ అభ్యర్థులు పాతికమందికి లోపుగా వున్నారు. అయితే వేషంలోమట్టుకు నిన్నటివారివలెనే తనకంటె భిన్నంగా వున్నారు. వారితో కలవకుండా తను కొంచెముదూరంగా కూర్చున్నాడు.

ఇంటర్వ్యూలు ప్రారంభమైయేయి. ఒకరొకరే లోపలకువెళ్ళి వస్తున్నారు. ఎవరికి అన్నట్టు వున్నారు. శర్మవంతు వచ్చింది. తనపేరు పిలువగానే సవినయంగా లోపలికి వెళ్ళేడు. పెద్ద టేబులుకి యెదురుగుండా ఐదుగురు సభ్యులు కూర్చొని వున్నారు. శర్మ వారికి నమస్కరించి వారు చూపించిన ఒక కుర్చీలో కూర్చున్నాడు. ముందు కుశల ప్రశ్నలు యేవేవో కొన్ని నడిచేయి. తనకు తోచినట్టు సమాధానం చెప్పేడు. ఇంతలో మధ్య కూర్చున్నాయన అసలు ప్రసంగంలోకి దిగేడు.

"బాంగ్‌కాక్ యెక్కడ."

"సయాంలో."

"సయాం యెక్కడ?" మిగతా సభ్యులందరూ నవ్వేరు.

దాంతో ఈ వుద్యోగం తనకు రాదనుకున్నాడు. ఇక అతను మాట్లాడలేక పోయేడు. పుస్తకాల్లో వున్నంతవరకు ప్రతి విషయం శర్మకు క్షుణ్ణంగా వచ్చును. వారికి కావలసినది పుస్తకాలలోని విషయం కాదు. ఒక్క ఐదునిమిషాలపాటు వాళ్ళను తన స్థితిలోను, తన్ను వారి స్థితిలోనూ వుంచితే "సమారా యెక్కడ? టిరానా యెక్కడ? అంకారా యెక్కడ?" అని గుక్క తిరగకుండా ప్రశ్నలువేసి వారిని చిత్తుచేసి వుండేవాడే. తర్వాత సభ్యులు అతని యం. ఏ. డిప్లొమాను చూసేరు. అతడు మొదటి తరగతిలో ప్యాసైనట్టు అది చెబుతోంది. యూనివర్సిటీ నిపుణులు క్షుణ్ణంగా పరీక్షచేసి అతనికి ప్రసాదించినదది. అయితే వీరు పరీక్షచేసేదేమిటి? "ఇదంతా కేవలం ఒక తంతు" అనుకున్నాడు శర్మ. మొదటితరగతిలో ప్యాసైన శర్మని పుస్తకజ్ఞానంలో ప్రశ్నించటం నిరర్థకం అనుకున్నారు కాబోలు వారు. మిగతా ఐదునిముషాలు గడపటానికి ఏవేవో ప్రశ్నలు వేయటం మొదలుపెట్టేరు.

"నీవు ధరించిన ఉత్తరీయం ప్రయోజనం యేమిటి?"

అక్కడివారి కెవరికీ ఉత్తరీయాలు లేవు. తన వేషం సరిగా లేదేమోనని శర్మ మొదటినుంచి భయపడుతూ నేవున్నాడు. అందరిలాగ సూటు నెక్టయి వేసుకొనివెళ్ళక భిన్నంగా తనెందుకు వెళ్లాలి? ఈ తేడాయే వారి నెక్కువగా ఆకర్షించినట్టుంది. అయినా తన దుస్తులసంగతి వారి కెందుకూ? పాశ్చాత్య దృక్పథంలోంచి ఆలోచించే వారికి ప్రతీదీ ముఖ్యమే (అని తమకు తెలుసు) అయితే తనుకూడా అటువంటి ప్రశ్నలు వారిని తిరగవేస్తే? "మీరు ధరించిన కోటుప్రయోజనమేమిటవి? నెక్టైప్రయోజనమేమిటీ? బనీను ప్రయోజనమేమిటీ..?" తన ఉత్తరీయానికి కొంత కాకపోతే కొంతేనా ప్రయోజనముంది కాని "ఈ ఉష్ణదేశములో వీరు ధరించిన నెక్టయి ప్రయోజనమేమిటి?"

శర్మ తన అభిప్రాయాలు మనసులోనే వుంచుకున్నాడు కాని పైకి మాట్లాడలేకపోయేడు. ఈ పరీక్షలో ఎటువంటి ప్రశ్నలువేసినా 'తపీ'మని సమాధానంచెప్పే నేర్పరితనం కావాలి. అది అతనికిలేదు.

"నీవు వెళ్ళవచ్చు" అన్నారు వారు.

నెమ్మదిగా లేచి బరువుగా అడుగులు వేసుకుంటూ బయటకు నడిచేడు. బయట బెంచిమీద పెట్టిన సంచీని తీసుకొని మొహం ఇటు అటూ కదల్చకుండా తిన్నగా వీధిలోపడ్డాడు. హోటల్లో రూంని ప్రొద్దుటే ఖాళీచేసేడు. రైలు టైంకు యింకా ఐదారుగంటలు వ్యవధివుంది. ఈ ఐదారుగంటలు గడపటం ఒక పెద్దసమస్య అయిపోయింది. మనస్సులో రైళ్ళు విమానాలు పరిగెడుతున్నాయి.

సెంట్రల్ స్టేషనుకుచేరి ఒక అరగంటసేపు యిటూ అటూ పచార్లుచేసేడు. గానుగయెద్దులాగ ఒకచోటే తిరగటం చాల విసుగ్గా వుంది. అక్కడనుంచి పారీస్ కార్నర్ వరకు నడిచి వెళ్ళేడు. ఈ నడకతో వళ్ళు పూర్తిగా అలసిపోయింది కాని మనసుకు విశ్రాంతి మాత్రం కలుగలేదు. అక్కడ ఒక బస్సుయెక్కి మౌంట్‌రోడ్డు, అక్కడనుంచి మైలపూరు, మైలపూరునుంచి లజ్ కార్నర్, అక్కడనుంచి త్యాగరాయనగర్ చేరేడు. మాంబళంలో ఎలక్ట్రిక్ ట్రైను యెక్కి మళ్ళీ పార్కుటౌను చేరేడు. బస్సులో వున్నంతసేపు మద్రాసులో చేసిన కార్యక్రమాన్నంతా మళ్లీ సమీక్షచేసుకున్నాడు. లెక్కల తణిఖీ డిపార్టుమెంటులో వుద్యోగం వచ్చే సావకాశం యెంతమాత్రం లేదు. బ్యాంకి యింటర్వ్యూకి వెళ్ళకపోవటం పొరపాటేమో అనుకున్నాడు. ఈ తప్పును యింటిదగ్గర కప్పిపుచ్చాలి. ఈ ఆలోచనలతో తల వేడెక్కిపోయింది. తైనాంపేటలో రోడ్డుప్రక్క అవారా కనపడ్డాడు. బుష్‌కోటూ, తనూ, చెట్లక్రింద అతి హడావుడిగా తిరుగుతున్నాడు. వాడి అవస్థను చూసి శర్మ నవ్వుకున్నాడు. బస్సులో వుండటంవల్ల వాడుమాత్రం తనని చూడలేదు.

సెంట్రల్ స్టేషనుకు చేరేటప్పటికి రైలు టైమయింది. టిక్కట్టు, నాలుగు అరటిపళ్లు కొనుక్కొని రైలెక్కేడు. ఆపూట భోజనం ప్రసక్తి మరి యెత్తుకోలేదు. సామానులు పెట్టుకునే పైబల్ల యెక్కి సంచి తలక్రింద పెట్టుకొని పడుకున్నాడు.

~~వారు ఈ ఉద్యోగం తనకే ఖాయం అంతులేకుండా వేయవచ్చును. నిజానికి~~

(ఇంకా వుంది)

పెద్ద కథ:

# ఉద్యోగాలు

(గతసంచిక తరువాయి)

పడుకున్నాడన్నమాటేకాని నిద్రపట్టలేదు. రైలులో నిద్రపోయే అలవాటు. అతనికసలెప్పుడూ లేదు. హొటలుతిండి పైత్యంచి తలదిమ్మెక్కింది. ఆలోచనలతోటి అది రెట్టింపయింది. చోటుకోసం తగాదాలతోటి, సినిమాపాటలతోటీ రాజకీయ చర్చలతోటీ, వస్తువులు తినుబండారాలు అమ్ముకునేవారి అరుపులతోటీ. పిల్లల యేడ్పులతో, తల్లుల సముదాయింపులతో పెట్టె గంద్రగోళంగావుంది. నిద్రపట్టే అవకాశం యెంతమాత్రం లేదు. "ఇంటిదగ్గర వచ్చే ఉపద్రవాన్ని ఎల్లాగ యెదుర్కోవాలీ" అని ఆలోచిస్తూ పడుకున్నాడు.

* * *

మర్నాడుదయం ఎనిమిది గంటలకు యింటికి చేరేడు. యిల్లంతా అతి హడావుడిగా వుంది. తను మెడ్రాసు వెళ్లిన మూడోరోజున విశాలాక్షి, రంగారావు పిల్లలు వచ్చేరు. బావ రంగారావు బి ఏ. బి.యిడి ప్యాసై...... హైస్కూలులో మాష్టరుగా చేస్తున్నాడు. విశాలాక్షి పురిటికి పుట్టింటికి వచ్చింది. వీధిగుమ్మంలో రంగారావు శర్మని చూడగానే "ఏమోయి. గురజాడ అప్పారావుగారి వెంకటేశంలాగ షేక్స్పియర్ మొహం వేసుకుని వచ్చేవు: వెళ్లిన పనైందా" అన్నాడు.

"నేనువెళ్లింది ఇంటర్వ్యూకి. అయింది. వచ్చాను" అన్నాడు ముక్తసరిగా. తల్లి లోపలనుంచి గబగబావచ్చింది. "ఉద్యోగమేమన్నా దొరికిందిరా అబ్బాయీ!" అంది.

"ఆ! జేబులో వేసుకొని తెచ్చేను" అన్నాడు తను.

"సరేలే. వీటికేంగాని అసలు సంగతేమిటో చెపుదూ" అంది ఆమె. తర్వాత దొడ్లోంచి తండ్రివచ్చేడు. ప్రశ్నతర్వాత ప్రశ్న నెమ్మదిగా అడిగేడు. లెక్కలతనిఖీ డిపార్టుమెంటు ఇంటర్వ్యూని వివరంగా చెప్పేడుశర్మ. తనకా వుద్యోగం వచ్చే సావకాశం యెంతమాత్రం లేదని కూడా తేల్చి చెప్పేశాడు.

"అయితే. బ్యాంక్ ఉద్యోగం సంగతేమిటి?" అన్నాడు తండ్రి కొంచెము చిరాకుగా.

గుటకలు వేయటం మొదలుపెట్టేడు శర్మ. మెడ్రాసు వదలినది లగాయతు ఆలోచిస్తున్నాడేకాని యేమి సమాధానం చెప్పాలో మాత్రం నిర్ణయించుకోలేక పోయేడు.

"అదీ అంతే అయింది" అన్నాడు ముక్తసరిగా.

"అంటే? అసలు ఇంటర్వ్యూకి వెళ్లేవా లేదా?" అన్నాడు తండ్రి.

"ఈ అనుమానం యెందుకు రావాలీ?" అన్నాడు శర్మ భయపడుతూ. శర్మ చేసిన పాపమేమిటో కాని అతనిమనసులోని విషయాలు మొహం స్పష్టంగా చెప్పేస్తూ వుంటుంది.

"మొదటినుంచీ ఆ వుద్యోగానికి వ్యతిరేకంగా వున్నావు. నువ్వు కనీసం ఇంటర్వ్యూకేనా వెళ్ళలేదని నాకు తెలుసు" అన్నాడు కోపంగా తండ్రి. శర్మ బ్యాంక్ దగ్గర జరిగిన విషయాలన్నీ స్పష్టంగా చెప్పేసేడు దాచటంవల్ల ప్రయోజనం ఆట్టే వుండదని.

## జె. పరబ్రహ్మం

"ఆ వుద్యోగానికి స్కూలు ఫైనల్ చాలట. నాకు అదనంగా అనవసరమైన డిగ్రీలు చాలా వున్నాయి. ఇవి వారికక్కరలేదట" అన్నాడు ధైర్యం తెచ్చుకొని.

"ఇటువంటి తెలివితేటలు. నీకు అపరిమితంగా వున్నాయని నాకు తెలుసు." నీవు ఇంటర్వ్యూకి వెళ్ళలేదని నాకు విచారం లేదు. నీవు వెళ్లినా వెళ్ళకపోయినా ఫలితం ఒక్కటే. నీ అమాయకత్వానికి మాత్రమే నేను బాధపడుతున్నాను" అన్నాడు తండ్రి

శర్మ చిన్నపుచ్చుకున్నాడు. మాట్లాడటానికికూడా ప్రయత్నించలేదు. రంగారావు నవ్వుతూ "ఇంతవరకూ నువ్వు చేసిన తెలివైనపనులలో యిదొకటి" అన్నాడు.

"ఏదీ?" అంది విశాలాక్షి.

"ఇంటర్వ్యూ ప్రమాదాన్ని తప్పించుకొని క్షేమంగా తిరిగి రావటం" అన్నాడు రంగారావు.

"హాస్యానికి కూడా ఒక హద్దుండాలి" అంది విశాలాక్షి.

"ఇందులో హాస్యమేముందీ? మీ తమ్ముడికి జిల్లాకలెక్టరుకు కావలసిన తెలివితేటలున్నాయి గుమాస్తా వుద్యోగానికి వెళ్ళమంటే యెల్లాగ వెడతాడు?" అన్నాడు.

శర్మ ఇంకక్కడ నిలబడలేక పోయేడు. తిన్నగా తన గదిలోకి వెళ్ళేడు. తన సమస్య మళ్ళ మొదటికే వచ్చింది. రోజంతా యెవరితోనూ మాట్లాడకుండా పెరల్ బక్ వ్రాసిన అదర్ గాడ్స్ అనే నవలను చదువుకుంటూ కూర్చున్నాడు.

"అయిందేదో అయింది. ఇకముందు ఇటువంటి పొరపాట్లు రాకుండా చూసుకోవాలి." అంది రాజ్యం.

"నేను చేసింది పొరపాటు అని నేననుకోవటం లేదు." అన్నాడు శర్మ.

"మీకు తోచదు. ఒకరు చెప్పినట్టు వినరు. అది మీ స్వభావం" అంది రాజ్యం. రెండోరోజున రంగారావు ప్రయాణమయ్యేడు.

"మీ స్కూల్లో మేష్టరీ ఉద్యోగాలు ఖాళీవస్తే మావాడికి చెప్పి పుణ్యం కట్టుకుందూ" అంది శర్మ తల్లి.

"అటువంటివివాడిహోదాకు పనికిరావు" అన్నాడు తండ్రి వెటకారంగా.

మర్నాడు కృష్ణారావు వచ్చేడు. కృష్ణారావంటే శర్మకు కొండంత సరదా. శర్మా కృష్ణారావులు చిన్నప్పుడు ఒకే క్లాసు చదువుకున్నారు. కృష్ణారావుకు ఆడిన అబద్ధం మళ్ళ ఆడకుండా యెటువంటివాడనైనా టోకరాకొట్టే నేర్పరితనం పుట్టుకతోటేవుంది. కర్ణంగారి అబ్బాయి రాఘవరావు యింకో సహాధ్యాయి. వీళ్లిద్దరికంటే శర్మ రెండుమూడేళ్ళు చిన్న. కృష్ణారావు రెండవ ఫారంలో తప్పిపోయి వెనుకబడిపోయేడు. తర్వాత ప్రతిక్లాసు రెండేసిసార్లు చూసుకుంటూ ఫిఫ్తుఫారంతో విద్య సమాప్తం చేసేడు. ప్రస్తుతం ఒక మందుల కంపెనీకి ఏజంటుగా పనిచేస్తున్నాడు. ఆపనిలో అతను చాల సమర్థుడు. కంపెనీవారు అతనికి స్పెషల్ ఇంక్రిమెంట్సుకూడా యిచ్చేరు. అతని జీతం ఎలవెన్సులు, టి. ఏలు, కేటాలు కలిపి నాలుగువందల రూపాయలవరకూ వస్తున్నాయి. కృష్ణారావుకు శర్మ అంటే యెంతో గౌరవం. చిన్నప్పుడు శర్మదగ్గర లెక్కలు, ఇంగ్లీష్ చెప్పించుకునేవాడు. శర్మవంటి తెలివైనవాడిని సరిగా ఉపయో

గించుకోలేకపోవటం ఈదేశంయొక్క లోప మనుకున్నాడు.

కృష్ణారావు ఒక పిల్లలకోడి. చిన్నప్పడెల్లావున్నా యిప్పు డెంతో బాధ్యత తెలిసినవాడులాగ కనబడుతున్నాడు. ఒక పెద్ద సంసారాన్ని యీదుకొని వస్తున్నాడు.

“నువ్వు చాల అదృష్టవంతుడివిరా” అన్నాడు శర్మ.

“యేమి అదృష్టంరా. నెలకు పాతిక రోజులు తిరగాలి. సత్రంభోజనం మఠం నిద్రలాగ వుంది నా బ్రతుకు. ఈ పాతిక రోజుల్లోనూ ఏపిల్లలకు జబ్బుచేసినా చూసే దిక్కులేదు. నేను యిల్లు వదిలితే యెక్కడ వుంటానో యెవరికీ తెలియదు”అన్నాడు.

“ఔను యెవరిబాధలువారికివుంటాయి” అనుకున్నాడు శర్మ

“బై ది బై. రాఘవరావు ప్యాసయ్యేడురా?” అన్నాడు కృష్ణారావు.

“ఏమోరా! వాడు నాకు నెంబరుకూడా చెప్పలేదు” అన్నాడు శర్మ.

“వాడెప్పుడూ అంతేలే. ఒకవేళ చెప్పినా ఆ నెంబరును నమ్మటానికివీల్లేదు” అన్నాడు కృష్ణారావు.

రాఘవరావూ శర్మ స్కూలు ఫైనల్ వరకూ సమానంగా వచ్చేరు. అయితే స్కూలు ఫైనల్‌లో రెండుసార్లు తప్పిపోయేడు. అప్పటినుంచి శర్మను తప్పించుకొని తిరిగేవాడు. అసలు శర్మ అంటే అతనికి మొదటినుండీ అసూయే. ఈసంగతి శర్మకు తెలిసినా తెలియకపోయినా కృష్ణారావుకు పూర్తిగా తెలుసు. స్కూలుఫైనల్ పూర్తికాగానే శర్మ... కాలేజీలో చేరేడు. రాఘవరావునుచూసినప్పుడల్లా కృష్ణారావు “శర్మని చూసి యేడవకపోతే నన్ను చూసి సంతోషించకూడదురా?” అనేవాడు.

“పోనిలేరా. పునాది గట్టిపడుతుంది” అంటూవుండేవాడు రాఘవరావు.

రాఘవరావు మళ్లీయేడుకూడాతప్పేడు. తర్వాత యింటర్మీడియెట్ చదివి నాల్గవసారి ప్యాసయ్యేడు. తర్వాత బి. యే. లో చేరేడు. బి. యే. చదువుతుండగానే రాఘవరావు వివాహం అతివైభవంగా జరిగింది. అత్తవారు చాలా భాగ్యవంతులు. పెళ్ళికి పేరుపొందిన ఒక సినిమాతార నాట్యప్రదర్శనంకూడా యేర్పాటు చేసేరు ఆవూరిలో ఈతరంలో జరిగిన ముఖ్య సంఘటనలలో రాఘవరావు వివాహం ఒకటి అని చెప్పుకోవచ్చు.

యువతి: ఈ పుస్తకము తీసుకొని నా డబ్బు నాకు ఇచ్చేస్తారా?

షాపు యజమాని: ఏమండి అచ్చు బాగోలేదా!

యువతి: ముగింపు బాగోలేదు.

—వల్లూరి రామారావు, బందరు.

శర్మ వివాహం అంతకు పూర్వమే తిరుపతిలో అతి నిరాడంబరంగా జరిగింది. “ఒక్కొక్కరి జాతకమహాత్మ్యం అటువంటిది” అనుకున్నాడు కృష్ణారావు. రాఘవరావు బి. యే. రెండుసార్లలో ఒకటి రెండు భాగాలు పూర్తిచేసేడు. మూడవ భాగానికి నాల్గవతడవ సెప్టెంబరుకు వెళ్లేడు. కృష్ణారావు రాఘవరావును చూసి “భాయీ! పునాది యెంతవరకూ గట్టిపడింది?” అని అడిగేడు.

“పోనీలేరా, మనకంటె ముందు ప్యాసైన వారు యేం బావుకున్నారు?” అన్నాడు రాఘరావవు.

శర్మ మెడ్రాసులో వుండగా బి. యే. పరీక్ష ఫలితాలు పేపర్లో పడ్డాయి. అయితే రాఘురావరావు నెంబరు తనకు తెలియదు. అయినా తను తన హడావుడిలో మునిగివున్నాడు.

శర్మ కృష్ణారావులు కలిసి రాఘవరావు యింటికి వెళ్ళేరు. రాఘవరావు వూళ్ళో లేడని బి. యే. ప్యాసయ్యేడని, సాయంత్రానికి రావచ్చునని రాఘవరావు తండ్రి చెప్పేడు. అక్కడ యిల్లంతా హడావుడిగా వుంది. గోడలకు వెల్లలు కొట్టించటం తలుపులకు రంగులు వేయటం మొదలైన పనులు చురుకుగా జరుగుతున్నాయి.

సాయంత్రం శర్మ కృష్ణారావు యింటికి వెళ్ళేడు. బైటవరండాలో కూర్చొని మాట్లాడుతూ వుండగా రాఘవరావు ఒక శుభలేఖల కట్ట పుచ్చుకొని సైకిల్ మీద వచ్చేడు.

శర్మని చూడగానే “హలో! ప్రొఫెసర్ గుడ్‌మార్నింగ్” అన్నాడు.

“కంగ్రాచ్యులేషన్సు. నువ్వు చెప్పకపోతే మాకు తెలియదనుకున్నావా?” అన్నాడు శర్మ.

“నేను మీ యింటికి అరడజనుసార్లు వచ్చేను. పెద్దలు మెడ్రాసు దయచేసేరని తెలిసింది. ఇక కృష్ణారావు యెప్పుడూ వూళ్ళోనే వుండడు.” అన్నాడు రాఘవరావు.




బ్రూక్ లాక్స్

ఒకరాత్రిలో విమ్మ సరిచేయును.

బ్రూక్‌లాక్సు చూపునకు, రుచికి రుచ్యమైన చాకొలెట్ వలె నుండును అయినా కడుపులో పోటుగాని, మంటగాని కలిగించకుండా నమ్మకంగాను, సుఖముగా చెడుగులను తీసివేయును. ఇది కుటుంబ సుఖ విరేచనకారి. బిడ్డలకు, పెద్దలకు కూడా మంచిది. ఎఱ్ఱ కార్టన్‌లో వుండే బ్రూక్ లాక్సునే తప్పక అడగండి.




విరేచన బద్ధకాన్ని సరిచేయుటకు చక్కని సులభోపాయము.

వెస్ట్ మినిస్టర్ లేబరేటరీస్ లిమిటెడ్, లండన్ వారి తయారీ

ఏజెంట్లు :-ఓరియంటల్ మర్కంటైల్ ఏజెన్సీ,

99 - ఎ - ఆర్మీనియన్ వీధి, మద్రాసు.

O. M. A. 11

తర్వాత అసలు విషయంలోకి దిగేరు. రాఘవరావు పత్నీసమేతంగా సత్యనారాయణవ్రతం చేసుకుంటున్నాడు. ఆ శుభలేఖలు వ్రతానికి ఆహ్వాన పత్రికలు. రెండు శుభలేఖలు తీసి ఒకదానిపై శర్మపేరు రెండోదానిపై కృష్ణారావు పేరు వ్రాసి వారివి వారికిచ్చేసేడు. ఆహ్వాన పత్రికలో రాఘవరావు. బి. యే. అనే మాటలు పెద్ద పెద్ద అక్షరాలతో ప్రాముఖ్యంగా వున్నాయి.

"ఇదంతా పరీక్షాఫలితాల పర్యవసానం అనుకుంటాను" అన్నాడు కృష్ణారావు.




# ★ ఉద్యోగాలు ★

"కాదోయి. పూర్వమే చేద్దామనుకున్నాం. కుడలేదు. ఇప్పుడు చేస్తున్నాం" అన్నాడు రాఘవరావు.

వ్రతానికి శర్మా కృష్ణారావులు సకుటుంబంగా వెళ్లేరు. రాఘవరావు ప్రతిభను వచ్చిన అతిథులంతా మెచ్చుకున్నారు. చురుకుతనం, శ్రద్ధ, పెద్దలపై గౌరవం మొదలైన సద్గుణాలన్నీ అతని సొత్తు అన్నారు. ప్రతివారి నాలుకమీదా రావు పేరే నాట్యం చేసింది.

కృష్ణారావు నవ్వుకున్నాడు... ఈ ప్రపంచం చాలా చిత్రమైనది. ప్రతివ్యక్తి తన చుట్టూ కృత్రిమమైన ఒక వాతావరణాన్ని కల్పించుకొని ఒక్క వెలుగు వెలగటానికి ప్రయత్నిస్తూ వుంటాడు. ఎవరిమీటింగులు వారే ఏర్పాటు చేయించుకొని ఉపన్యాసాలు దంచటం, ఎవరిదండలువారే కొనుక్కొని మెడలో వేయించుకోవటం, ఫోటోలు తీయించుకోవటం, పేపర్లలో వేయించుకోవటం సాధారణ విషయమై పోయింది...పాపం! శర్మమాత్రం ఇటువంటి ప్రపంచానికి భిన్నంగా వున్నాడు. నిజమైన అవకాశాలు అతని కన్నోవచ్చేయి. వాటిని వినియోగపరచుకోక తృణీకరించేడు. అతని విద్యార్థిదశలో అనేక బహుమానాలు వచ్చేయి. వాటిని అతడు పరోక్షంగా మాత్రమే తీసుకున్నాడు. శర్మకు రాఘవరావుకు యెంత తేడావుంది! వచ్చిన ప్రతిచిన్న అవకాశాన్ని పూర్తిగా ఆలోచించుకుంటూ నిశ్శబ్దంగా కూర్చున్నాడు కృష్ణారావు.

రాఘవరావు తనకంటె అదృష్టవంతుడు అనుకోవటం తప్ప ఇంకోవిధమైన ఆలోచన చేయలేదు శర్మ.

రాఘవరావు యెంత అట్టహాసం చేస్తున్నప్పటికీ మనస్సులో మాత్రం తృప్తిగా లేదు. అతని దృష్టికి శర్మ ఒక అగాధమైన మహాసముద్రంలాగ నిశ్చలంగా వున్నాడు. ఎంత చేసినప్పటికీ, యెంతమంది తన్ను భూషించినప్పటికి శర్మ అంతస్తువేరు. దానిని తను యెప్పుడూ అందుకోలేడు. ఈసమయంలో అతనిమనస్సును యెక్కువగా పీడిస్తున్నది ఈవిషయమే.

వ్రతానికి శర్మ తల్లీతండ్రీకూడా వచ్చేరు. రాఘవరావు చాకచక్యం చూసిన తర్వాత తమ కొడుకు వట్టి అప్రయోజకుడై పోతున్నాడనుకున్నారు.

ఇంటికి వెళ్ళినతర్వాత తల్లి "వీడేదేనా వుద్యోగం చూసుకుంటేకాని యింకెందుకూ పనికిరాడు" అంది.

"ఆ సంగతి నీకూ నాకూ తెలిసి యేం ప్రయోజనం? వాడికి తెలియాలికాని" అన్నాడు తండ్రి.

శర్మ యింక అక్కడ నిలబడలేక వెళ్ళిపోయేడు. తిన్నగా కృష్ణారావుయింటికి వెళ్ళేడు. కంపెనీవారి దగ్గరనుంచి యేదో టెలిగ్రాం వచ్చిందనిన్నీ కృష్ణారావు వెళ్ళిపోయేడనిన్నీ చెప్పేరు. అక్కడనుంచి తిన్నగా కాలువ వొడ్డుకుపోయి మెట్లమీద కూర్చుని తన పరిస్థితిని గూర్చి చాలసేపు ఆలోచించుకున్నాడు. "ఉద్యోగం రాకపోవటం కేవలం తన తప్పే అని అందరూ యెందుకనుకుంటున్నారో తెలియలేదు వారి కెంత తొందరగావుందో తన కంత కంటె నాలుగురెట్లు యెక్కువ తొందరగానే వుంది. అయితే వుద్యోగం సంపాదించటం యెట్లాగ? అదిమాత్రం యెవరూ చెప్పరు."..."ఉద్యోగం రాకపోవటం తన చదువు లోపమేకాని తనలోపం యెంత మాత్రం కాదు."

ఇంటర్మీడియట్ అవగానే యం. బి. బి. యస్ కాని ఇంజనీరింగ్ కాని చదువుదామనుకున్నాడు. కాని ఆ రెండింటిలోనూ సీటు రాలేదు. తనకు ఇంటర్మీడియెట్ లో వచ్చిన క్లాసుకాని ర్యాంక్ కాని సీటు సంపాదించుకునేందుకు సహాయపడలేక పోయేయి. తనకంటె బాగా తక్కువ మార్కులు వచ్చిన అనేకమందికి సీట్లు వచ్చేయి. అదీ తన దురదృష్టమే ననుకున్నాడు.

ఈవిధంగా ఆలోచించుకుంటూ ఇంటికి చేరేటప్పటికి చాలా ప్రొద్దుపోయింది. ఎత్తిపొడుపుమాటలు మళ్ళీ ప్రారంభమయ్యేయి.

"నీ పనికి భోజనం చేయటానికి కూడా తీరిక లేనట్టుందే?" అన్నారు. శర్మ పైకి నిశ్చలంగావున్నా లోపల లోపల కుమిలి పోయేడు. అతని దుర్భరమైన పరిస్థితిని రాజ్యం గ్రహించింది. శర్మమీద ప్రేమేకాక ఆమెకు గౌరవం యెక్కువైంది." తన చేతిలోవున్న పరీక్షలు తిరుగులేకుండా ప్యాసయ్యేడు. ఉద్యోగానికి అదృష్టం కలిసిరావాలి. అందరూ కలిసి నిందిస్తే ప్రయోజన మేమిటి? మనసు పాడవటం తప్ప? శర్మకు యెంతో ధైర్యం చెప్పింది.

మర్నాడు రాజ్యం పుట్టింటికి తండ్రి పేర పరిస్థితులన్నీ వివరిస్తూ ఒక వుత్తరం వ్రాసింది. తిరుగు టపాలో శర్మ తండ్రికి ఒక ఉత్తరం వచ్చింది. పల్లెటూరిలోవుండి ఉద్యోగప్రయత్నం చేయటం కష్టమనిన్నీ ఒక వారంరోజులపాటు రాజ్యాన్నీ శర్మని తమవూరు పంపిస్తే ఉద్యోగప్రయత్నం చేయవచ్చునని వ్రాసేడు.

శర్మ కుటుంబంతో సహా అత్తవారింటికి చేరేడు. మామగారు, శర్మని తనకు తెలిసిన పెద్దమనుష్యు లందరికీ పరిచయం చేసేడు. అవసరాన్నిబట్టి వారు ఉద్యోగ ప్రయత్నాలలో సహాయపడగలరని చెప్పేడు.

ఒకరోజు సాయంత్రం పార్కులో పెద్ద బహిరంగ సభ జరుగుతోందని తెలిసి శర్మ అక్కడకు వెళ్లేడు. అది వెనుకబడిన జాతుల వారి మహాసభ. వెనుకబడిన జాతులవారికి చెందిన మహానాయకులు చాలామంది వచ్చేరు.

శర్మ వెళ్లేటప్పటికి సభ ప్రారంభమైంది. ఒక కులమునకు చెందిన మహానాయకు



డుపన్యసిస్తున్నాడు. వారిజాతి వెనుకబడి వున్నదనీ, విద్యలో ఉద్యోగాలలో, ఆర్థిక రంగాలలో వారి జాతికి ప్రత్యేకమైన రక్షణలు కావాలని ఉపన్యాసం పూర్తిచేసేడు. ఇంకొక జాతినాయకుడు లేచి వారిది ఇంకా వెనకబడిన జాతి అనీ, వారికింకా యెక్కువ రక్షణలు కావాలన్నాడు. మూడవజాతి నాయకుడులేచి తాముపై వారికంటేకూడా వెనకబడి వున్నామనీ అందరి కంటె యెక్కువగా రక్షణలు తమకే కావాలని వాదించేడు. ఈ సమయంలో ఇంకో మహానాయకుడు వేదికమీదకువచ్చి గట్టిగా వుపన్యాసం ప్రారంభించేడు. "ఇంతవరకు తమ కులమువారిని ప్రభుత్వము వెనుకబడిన వారి క్రింద పరిగణించలేదనీ, తాముకూడా వెనుకబడి యుండుటకే నిశ్చయించుకున్నామనీ ఆ విషయమె గవర్నరుకు టెలిగ్రాము ద్వారా తెలియజేయనున్నామనీ, తమకు కూడా అందరితో బాటు ప్రత్యేకమైన రక్షణలు కావాలని ఈ సభవారు తీర్మానించాలనీ కోరేడు. కాని మొదటి నాయకుడు వెంటనే లేచి మీరు వెనకబడి లేరన్నాడు. సభలోని వారు కొందరు లేచి మేము వెనకబడే వున్నామన్నారు. ఇంకొక వైపునుంచి మరికొందరు లేచి మీరు యెంతమాత్రం వెనుకబడిలేరు అన్నారు. సభలో పెద్ద అలజడి ప్రారంభమైంది. దానిని అదుపులో పెట్టే శక్తి యెవరికీ లేకపోయింది. యే తీర్మానం చేయకుండానే సభను ముగించి నాయకులు వెళ్ళిపోయేరు. శర్మ తనలో "ఇదంతా యోగ్యతలతో నిమిత్తంలేకుండా ఉద్యోగాలు కావాలనే కుమ్ములాట తప్ప మరేమీ కాదనుకున్నాడు. తనకుమాత్రం పుట్టుకవల్ల, యం. ఏ. మొదటి తరగతిలో ప్యాసవటంవల్ల వెనుకబడి వుండటానికి యెంతమాత్రం సావకాశం లేకుండా పోయింది. ఇక తనకు ఉద్యోగం రావటమెల్లాగ?

శర్మ అత్తవారింటికి వెళ్ళిన ఆరవరోజున తండ్రిదగ్గరనుండి వుత్తరం వచ్చింది విశాలాక్షికి మొగపిల్లాడు పుట్టేడనీ, ఇంట్లో ఇబ్బందిగా వుందనీ, ఉద్యోగప్రయత్నాలు తర్వాత చేయవచ్చును కాబట్టి వెంటనే బయలుదేరి రమ్మనమని వ్రాసేడు. ఆ సాయంత్రమే శర్మ కుటుంబంతో సహా బయలుదేరి ఇంటికి జేరేడు.

ఇంటికిజేరినతర్వాత శర్మకు తన పూర్వపు జీవితం యథాతథంగా ప్రారంభమైంది. అంతకంతకూ దరఖాస్తులు చేయటంకూడా వ్యర్థమనిపించింది. చాలవుద్యోగాలకు దరఖాస్తులుచేయటం కూడా మానేశాడు. "వాంటెడ్ కాలమ్సు"ని కూడా చూడటం అసహ్యమనిపించింది. తాను మాత్రం ఇంటితో సంబంధము లేనట్టు ప్రవర్తిస్తున్నాడు. సాధ్యమైనంతవరకు ఇతరులతో సంబంధంలేకుండా తన గదిలో కూర్చుని యేవేవో పుస్తకాలు దొరికినంతవరకూ చదవటం యెవరేనా మాట్లాడితే ముక్తసరిగా సమాధానాలు చెప్పటం, తన్ను గురించి యెవరు యేమనుకున్నా విననట్టు వూరుకోవటం, ఈవిధంగా ఒక నెల్లాళ్ళు గడిపేడు. ఈ నెలరోజులలో యెడతెరిపి లేకుండా జేన్ ఆస్టిన్, తామస్ హార్డీ, పెరల్ బక్ వ్రాసిన నవలలు చదివేడు. తర్వాత బెర్నార్డుషా జాన్ గాల్స్వర్దీ డ్రామాలు తెచ్చుకొని చదవటం మొదలు పెట్టేడు. పుస్తకం తెరిచి వుంచినంతసేపు మనస్సుకు శాంతిగానే వుండేది. పుస్తకంమూయగానే మనసును పట్టుకోవటం అసాధ్యంగా వుండేది.

"ఈవిధంగా కూర్చునితింటుంటే యెంత కాలం వస్తుంది. ఏదో పైన కొంత సంపాదిస్తే వేన్నీళ్ళకు చన్నీళ్ళన్నట్టు నడిచిపోతుంది కాని" అనేమాటలు రోజూ అతని చెవిలో పడుతూనే వున్నాయి.

శర్మ నిర్లక్ష్యాన్ని తండ్రి గ్రహించేడు. అయితే యేమిచేయాలో ఆయనకు కూడా తెలియలేదు. ఇక ఏవేనా ఉద్యోగాల నిమిత్తమై చేయబడిన ప్రకటనలు కనబడితే ఆయనే స్వయంగా శర్మతో చెప్పి దరఖాస్తు చేయమనేవాడు.

శర్మ తండ్రి ఒకరోజున ఒక ప్రకటనను తీసికొనివచ్చి దానికి దరఖాస్తు చేయమని గట్టిగా శాసించి వెళ్లేడు.

ఆ ప్రకటనను శర్మ జాగ్రత్తగా చదివి యే తేదీలోగా దరఖాస్తు చేయాలో, ఎంత ప్రవేశరుసుము చెల్లించాలో, జీతమెంతో, వ్రాయబడివున్నాయి. అన్నీ శర్మకు తృప్తికరంగానే వున్నాయి ఐతే ఆ ఉద్యోగానికి కావలసిన అర్హతలు చూడగానే మనసు వశం తప్పుతోందా అనిపించింది. ఒకకులమువారైతే బి.యే. మొదటి లేదా రెండవ తరగతులలో ప్యాసై వుండాలనీ, ఇతర కులాలవారైతే, బి యే ప్యాసై వుంటే చాలనీ వెనుకబడిన వర్గాలవారికి మాత్రం ఇంటర్మీడియేట్ ప్యాసైవుంటే చాలునని వుంది. 'దరఖాస్తు చేయటమా మానటమా?' అని ఒకనిర్ణయానికి రాలేకపోయేడు. అతని మనసుకు ఒక వెఱ్ఱి ఆలోచన తట్టింది. వెంటనే ఆ ప్రకటనను పత్రికనుంచి జాగ్రత్తగా కత్తిరించి తీసేడు. దానికి క్రిందిభాగములో అదేసైజుగల చిన్న కాగితాన్ని అతికించేడు. దానిమీద చిన్నచిన్న అక్షరాలతో "ఇంకా వెనుకబడిన జాతివాడైతే స్కూల్ ఫైనల్ చాలుననీ, అటవికుడైతే ఎనిమిదవ తరగతివరకూ చదివివుంటే చాలునని బట్టలు ధరించటంకూడా తెలియని అనాగరికుడైన ఆదిమనివాసుడైతే చదువు రానివాడైనా దరఖాస్తు చేయవచ్చునని" వ్రాసేడు. ఆ ప్రకటనను జాగ్రత్తగా మడతపెట్టి ఒక కవరులో పెట్టి యే అధికారివద్దనుంచి ఆ ప్రకటన వచ్చిందో అతని చిరునామాకి పంపించేడు. ఈపని పూర్తిచేసి మళ్లీ తనగదిలోకి ప్రవేశించేడు. కాని అతని గుండె దడదడగావుంది. తను చేసినది చాల తెలివితక్కువ పనేమో అనుకున్నాడు. ఈ దేశంలో అనేకలోట్లు వుండవచ్చును ఈ దేశాన్ని మరమత్తు చేయటం తనవంటి అమాయకుని పనేనా? గుండెదడ యెక్కువైంది. తను చేసినపనికి యెంతో



# ★ ఉద్యోగాలు ★

విచారపడ్డాడు. ఆ విధంగా వ్రాసిపంపించే ధైర్యం తనకు యెక్కడనుంచి వచ్చిందీ? తనువ్రాసిన పిచ్చివ్రాతను ఆ అధికారి చూస్తాడా? ఈలోగానే యెవరో ఒకరు దానిని-చింపి అవతల పారవేస్తారు. నిజంగా తను ఒక అమాయకుడే. అందువల్లనే అతనికే వుద్యోగం దొరకలేదు. ఆరోజున యిక పుస్తకంకూడా చదవలేకపోయేడు. కాలం యేవిధంగా వెడుతోందో తనూ అవిధంగానే వెళ్లాలి. ప్రవాహానికి యెదురుగా వెడితే నష్టపోయేది తనేకాని ప్రవాహంమాత్రం కాదు.

ఆ సాయంత్రం తండ్రి శర్మ గదిలోకి వచ్చి "దరఖాస్తు పంపించేవా?" అన్నాడు.

"లేదు."

"యేమీ?"

"నేను ఆ వుద్యోగానికి కావలసినంతగా వెనకబడిలేను" అన్నాడు శర్మ.

తండ్రికి విపరీతమైన కోపం వచ్చింది.

"కావలసినదానికంటె యెక్కువగా చదివించటం నాదే తప్పు. చిన్న ఉద్యోగాలు నీకు పనికిరావు; పెద్దవి రావు. ఈ విధంగా నువ్వు బాధపడవలసిందే."

ఎల్లాగైనా శర్మచేత దరఖాస్తు చేయించాలన్న ఉద్దేశ్యంతో వున్నాడాయన. శర్మ చేసిన తెలివితక్కువపని ఆయనకు తెలియదు. కాసేపాగి "అయితే యేమి చేయదల్చుకున్నావు?" అన్నాడు.

"ఏమీ లేకపోతే వ్యవసాయం చేయదల్చుకున్నాను."

శర్మ ఇటువంటి సమాధానం చెబుతాడనుకోలేదు తండ్రి.

"నువ్వు వ్యవసాయానికి పనికిరావని నా కేనాడో తెలుసు. నువ్వు వ్యవసాయం చేస్తే గింజ పండదు. పండినా యింటికి రాదు."

"అయితే ఈ సంవత్సరం ఇల్లాగవుండి వచ్చేయేడు 'లా' చదువుతాను."

"నీ చదువుమీద ఇంతవరకూ చేసిన దండగ చాలు" అన్నాడు తండ్రి.

"ఏమైనాసరే ఈ వుద్యోగానికి దరఖాస్తు చేయకపోవటం మాత్రం ఖాయం" అన్నాడు శర్మ. తండ్రి కోపంగా వెళ్ళిపోయేడు.

కృష్ణారావు క్యాంపునుండి తిరిగి రాగానే జరిగిన విషయం అంతా చెప్పేడు. సెప్లికేషనుకు బదులుగా ప్రకటన కాగితాన్నే కొద్దిపాటి సవరణలతో వెనుకకు తిరిగి పంపించేనని చెప్పి తన గుండెల్లో వున్న బరువంతా వదుల్చుకున్నాడు.

"భేష్! చాలా మంచిపని చేసేవు. నీలో పైకివచ్చే సూచనలు యిప్పుడిప్పుడే కనబడుతున్నాయి. ఈమాత్రం గుండె నిబ్బరం ఇదివరకే వుంటే చాలా బాగుపడేవాడివి. ఇటువంటి పనులు నేను రోజుకి అరడజను తక్కువ కాకుండా చేస్తుంటాను." అన్నాడు కృష్ణారావు

ఇంతలోకే రాఘవరావు సైకిల్ మీద అతి అట్టహాసంగా వచ్చేడు. శర్మ దగ్గర అంత సంతోషాన్ని ప్రదర్శించటం ఇదే మొదటిసారి. యేదో పెద్ద విశేషం వుందనుకున్నారు.

సాధారణ మర్యాద వాచకాలైన గుడ్ మార్నింగులైన తర్వాత

"పబ్లిక్ సర్వీసు కమీషన్ పరీక్షాఫలితాలు వచ్చేయి" అన్నాడు రాఘవరావు.

"మీ ఇంటిదగ్గరకు వెళ్ళివస్తున్నాను. నరసారాయణు లిద్దరూ ఒకచోట వుంటారని తెలిసి ఇక్కడకు వచ్చే" నన్నాడు మళ్ళీ.

"మమ్మల్ని చంపక అసలు సంగతేదో చెపుదూ?" అన్నాడు కృష్ణారావు. అ యేముందిలే; మీ దయవల్ల పబ్లిక్ సర్వీసు కమీషనులో ప్యాసయ్యేను. '......' తాలుకా ఆఫీసులో క్లర్కుగా వేసేరు" అన్నాడు నెమ్మదిగా. లోపల్నుంచి సంతోషం పైకి తన్నుకొని వస్తోంది. శర్మ తనకంటె యెక్కువ చదువుకున్నాడు. చదువు ముందు పూర్తిచేసేడు. అయితే ఉద్యోగం మాత్రం సంపాదించుకో లేకపోయేడు. ఈ రోజున శర్మమీద నిజమైన విజయాన్ని సంపాదించే ననుకున్నాడు.

శర్మ పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షలకు కట్టలేదు. అప్పటి కింకా తన కేదో పెద్ద వుద్యోగం వస్తుందనే ఆశతో వున్నాడు. ఇప్పుడా ఆశలు తీరిపోయేయి. పబ్లిక్ సర్వీసు పరీక్షలకు కట్టకపోవటం తప్పు కుండా పొరపాటే అనుకున్నాడు. తండ్రి తనను నిందించటములో అర్థంలేకపోలేదు.

"నీ జీవితంలో అతి ముఖ్యమైన సమస్య ఒకటి పరిష్కారమైందన్నమాట—" అన్నాడు శర్మ.

"అయితే నిన్ను మన జిల్లాలో వేయక ఇంకో జిల్లాలో వేసేరేమిరా?" అన్నాడు కృష్ణారావు.

"నేనే ఆ జిల్లాని కోరేనోయి. మన జిల్లాలో ప్రమోషన్లు త్వరగా రావు" అన్నాడు రాఘవరావు.

రాఘవరావు సంతోషం పట్టలేకుండా వున్నాడు. చదువు పూర్తికావటం ఆలస్యమైనప్పటికీ వుద్యోగం సంపాదించటంలో విజయం తనదే అనుకున్నాడు. ఒకవేళ శర్మ మళ్ళీసారి పబ్లిక్ సర్వీసు పరీక్షలకు వెళ్ళినప్పటికి తన కతనిపై సీనియారిటీ వుంటుంది. ఈలోగా తను యే డిప్యూటీ తాసిల్దారో అయ్యే సావకాశం వుంది. శర్మ తనదగ్గర గుమాస్తాగా వుండవలసిందే. అనేక విధాలుగా వూహించుకున్నాడు రాఘవరావు. చివరకు ఉండబట్టలేక,

"ఎగిరెగిరివెళ్లే కుందేటికంటె తాపీగా వెళ్లే తాబేటిదే విజయం" అన్నాడు.

"నిజమేరా బ్రదర్! నువ్వు చాలా అదృష్టవంతుడివి" అన్నాడు శర్మ.

కృష్ణారావుకి మాత్రం రాఘవరావు మాటలు ఏమాత్రం నచ్చలేదు. "శర్మకీ రాఘవరావుకీ పోలికెక్కడ? చిన్న గుమాస్తాగిరీ రాగానే యింద్రుడి సింహాసనం సంపాదించినట్టు సంతోషిస్తున్నాడు." అనుకున్నాడు పైకిమాత్రం.

"నీ ఉపమానం ఇక్కడ యెంతమాత్రం సబబుగా లేదు. కేవలం ఉద్యోగం సంపాదించటమే జీవితంయొక్క ఏకైక లక్ష్యం అనుకుంటే విజయం పూర్తిగా నాది. మూడేళ్ళనుంచి నెలకు మూడువందలు చొప్పున తెచ్చుకుంటున్నాను కానీ నే నెప్పుడూ నీలాగ అనుకోలేదు. చదువుకున్న వాడి విలువ వేరు" అన్నాడు కృష్ణారావు.

"ఏదో సరదాగాఅన్నాను. సీరియస్ గా తీసుకోవద్దు" అన్నాడు రాఘవరావు.

"నేనూ అంతే" అన్నాడు కృష్ణారావు.

శర్మకి ఈవిధమైన ప్రసంగం యెంతమాత్రం యిష్టంలేదు. ఎవరిఅదృష్టం వారిది. నిజంగా రాఘవరావు యెన్నోవిధాలుగా తనకంటే అదృష్టవంతుడు. దానిని కాదనటానికి వీల్లేదు అనుకున్నాడు.

తర్వాత ప్రసంగం కొంత సరదాగానే నడిచింది. రాఘవరావుమాత్రం తన ఉద్యోగాన్ని వూహించుకుంటూ తన భావిజీవితంలో చేయదల్చుకున్న పనుల్నిగురించి యేవేవో చెబుతున్నాడు.

"వెఱ్ఱివాడు. వుద్యోగమంటే యేమిటో అనుకుంటున్నాడు" అనుకున్నాడు కృష్ణా

Sastry's HOTEL

శాస్త్రీస్ హోటల్

చిక్ పేట, బెంగుళూరు సిటీలో బసచెయ్యండి.

రావు. తర్వాత ముగ్గురు మిత్రులు ఆపూటకు విడిపోయేరు.

రాఘవరావు ఉద్యోగం వార్త ఒక గంటలో ఆ వూరంతా పాకిపోయింది. రాఘవరావు తండ్రి శర్మగారింటికి యేదో పని కల్పించుకొని డజనుసార్లు వచ్చేడు. వచ్చినప్పుడల్లా ఒక అరగంటసేపు రాఘవరావు భవిష్యత్తుని గురించి అతని తెలివితేటలు గురించి ఉపన్యాసం చేసి వెడుతున్నాడు. ఆరోజంతా ఆయన వీధిలో నేతప్ప యింట్లో లేడు. ఎవరికైనా ఉద్యోగం రాకపోతే అది వారిలోటే కాని మరేమీ లేదన్నాడు.

రాఘురావు విషయం అసలు చెప్పక్కర్లేదు. శర్మకి పుస్తకాలు రుబ్బటం మాత్రమే చేతనౌనుకాని లోకజ్ఞానం యేమాత్రం లేదనీ, అందుచేత అతనికి యేవుద్యోగం చేసే అర్హతా లేదనీ, అంతేకాని ఈ భారతదేశంలో ఉద్యోగాల కెంతమాత్రం కొరత లేదని కూడా చెప్పటం మొదలుపెట్టేడు.


ఇక రాఘవరావు భార్య గిరిజకు ఆరోజు స్వర్గంలో తిరుగుతున్నట్టుంది. ఏదోవిధంగా తెగిసిచేసుకొని రాజ్యానికి ఈ వార్త స్వయంగా చెబితేకాని ఆమెకు తృప్తిగా లేదు. రాజ్యానికి ఈవార్త తెలియదని కాదు. యేదో ఒక మిషమీద వెళ్ళి ఆమెకు తనే స్వయంగా చెప్పాలి. ఆవిషయాన్ని ఆమె యేవిధంగా గ్రహిస్తుందో తెలుసుకోవాలి. ఇక రాఘవరావు తల్లి సంగతి వేరే చెప్పక్కర్లేదు.

మొత్తంమీద ఆ యింటిలో వారందరికీ ఉద్యోగం సంపాదించిన రాఘవరావు ఇండియా సామ్రాజ్యాన్ని సంపాదించిన రాబర్టు క్లైవులాగ కనపడ్డాడు. వారొక డిన్నర్ పార్టీ యేర్పాటు చేయాలని నిశ్చయించుకున్నారు. ఆ సందర్భంలోనే రాఘవరావు తమ్ముడు లక్ష్మణరావు ఉపన్యాసం కూడా జతపరచి పెద్దయెత్తున ప్రయత్నాలు చేసేరు.

రాజ్యంమాత్రం ఆరోజున మనసులో యెంతో నొచ్చుకొంది తన భర్తకంటె తక్కువ చదివినవారికి కూడా ఉద్యోగాలు వస్తున్నాయి. శర్మకు ఉద్యోగం రాకపోవటం గ్రహచారమే కాని మరేమీ కాదనుకుంది.

శర్మయింటికి రాగానే రాజ్యం "కరణంగారి అబ్బాయి రాఘవరావుకి ఉద్యోగం వచ్చిందిట" అంది.

"సంతోషం" అన్నాడు శర్మ. ఇక మిగతావారెవరూ మాట్లాడలేకపోయేరు. శర్మ తండ్రి మాత్రం "వీడికి రాఘవరావుకి పోలికెక్కడ? వాడికున్న లోకజ్ఞానంలో పదవవంతు కూడా లేదు మనవాడికి" అన్నాడు. శర్మ తల్లికి మాత్రం ఈమాటలు నచ్చలేదు. "పోనీ లేద్దురూ. ఇంతోటి గుమాస్తాగిరి రాకపోతే పోయింది. మనవాడిది పెద్ద చదువు. చదువుకున్నది యెప్పుడూ వ్యర్థం కాదు. ఎప్పుడో ఒకప్పుడు పెద్ద వుద్యోగం వచ్చి తీరుతుంది." అంది. పైకి ఈమాట అంది కాని లోపల ఆమెకు బాధగా నేవుంది. ఆ యింట్లో అసలు యే బాధా లేకుండా వున్నటు కనిపించింది ఒక శర్మ మాత్రమే.



# ★ ఉద్యోగాలు ★

కరణంగారి యింటో డిన్నర్‌పార్టీకి ఆహ్వానాలు వచ్చేయి. మొదట కృష్ణారావు డిన్నరుకు రానన్నాడు. వెళ్ళకపోతే బాగుండదన్నాడు శర్మ. మొత్తంమీద వారు వారి కుటుంబాలతో సహా డిన్నర్ పార్టీకి హాజరయ్యేరు. రాఘవరావు చాల ఉత్సాహంగాను, చురుకుగాను తిరుగుతున్నాడు. ఏమూల చూసినా అతనే కనబడుతున్నాడు కృష్ణారావు శర్మలదగ్గరకువచ్చి "మొహమాటం పడకుండా కావలసినవన్నీ అడిగి వేయించుకోండి" అని పదేపదే హెచ్చరించి వెడుతున్నాడు. ఇక పెద్దవాళ్ల పంక్తిలో కూర్చున్న రాఘవరావు తండ్రి కరణంగారు రెవెన్యూ డిపార్టుమెంట్ ఉద్యోగమంటే యేమిటో, దానికి యెంత హోదా వుంటుందో సవివరంగా చెపుతున్నాడు. తమవాడు గుమాస్తాగా ప్రవేశించినప్పటికే బి. యే ప్యాసై వుండటంవల్ల ప్రమోషన్లు బహు తేలికగా వస్తాయన్నాడు. "ఒక్క ఐదేళ్లు ఓపిక పట్టేమంటే తాసిల్దారై కూర్చోవచ్చు" అన్నాడు అందులో రాఘవరావులాంటి చురుకైనవాడికి ప్రమోషన్లు మరీ తేలిక. రాఘవరావు సంపాదించినది గుమాస్తాగిరి అయినప్పటికీ వారి ఊహల్లో అప్పుడే డిప్యూటీ కలకరై కూర్చున్నాడు. డిపార్టుమెంట్ పరీక్షలు ప్యాసవటం మాత్రమే ఇక ఆలస్యం. కరణంగారు "ఫలానావారు గుమాస్తాలో ప్రవేశించి పదేళ్లలో డిప్యూటీ కలక్టరైయ్యేరు. ఇంకొకరు పన్నెండేళ్ళు పూర్తికాకుండానే జిల్లాకలక్టరయ్యేరు" అని యెంతమంది గుమాస్తాలు కలక్టరైందీ సంఖ్యాపూర్వకంగా ఉదాహరణలతోటి ఋజువు చేస్తున్నాడు. వచ్చిన అతిథులందరూ కూడా, రాఘవరావు డిప్యూటీ కలక్టరవటానికి ఆట్టే ఆలస్యం లేదు" అన్న ప్రతిపాదనను ఏకగ్రీవంగా సమ్మతించినట్టే కనపడ్డారు.

జీవితంలో ఆరితేరినకృష్ణారావు ఇదంతా ఒక వినోదంక్రిందా, శర్మ "ఈవిధంగా అనుకోవటం సహజమే" అన్నట్టుగా భావించేరు.

ఆడవారి పంక్తిలో గిరిజా, గిరిజ అత్తగారూ, చేసే కోలాహలానికి హద్దులేకుండావుంది. "డిగ్రీలు వుండగానే సరా యేమిటి, వుద్యోగం లేకపోయిం తర్వాత" అన్న మాటలు రాజ్యానికి తరుచు వినిపించేయి. ఆ మాటలు విన్నప్పుడల్లా మనసు చివుక్కుమంటోంది "తనకంటే ఎక్కువ చదివినవారికికూడా ఉద్యోగాలు రాని సమయంలో రాఘవరావు ఉద్యోగం సంపాదించేడంటే అతనిలో వున్న ప్రతిభ కాకపోతే మరేమిటి?" అక్కడకు చేరిన వారందరి అభిప్రాయమూ అట్లాగే వుంది. "పాపం! మీవారికింకా వుద్యోగం రాలేదూ?" "తెలివైనవాడే! ఉద్యోగం యెందుకు రాలేదో?" అనే వూరడింపు మాటలు కూడా వినపడ్డాయి. ఈ ఊరడింపులు రాజ్యం, రాజ్యం అత్తగారి బాధ యెక్కువ చేయటానికిమాత్రమే ఉపయోగపడ్డాయి. అక్కడ వున్నంతసేపు వారికి ముళ్లమీద కూర్చున్నట్టు వుంది.

మర్నాడుదయం కొంపుకి వెడుతూ కృష్ణారావు శర్మ యింటికి వచ్చేడు. శర్మ తండ్రికి కృష్ణారావు సావాసం యెంత మాత్రం యిష్టం లేదు. శర్మ లోపాలన్నిటికీ కృష్ణారావే కారణం అని ఆయన నమ్మకం. అయితే కృష్ణారావు ఉన్నంతసేపు శర్మ ఈ మానవ ప్రపంచంలో వున్నట్టు కనబడతాడు. అందుచేత కృష్ణారావును చూసి లోపల గొణుక్కోవటమే కాని పైకి ఏమీ అనేవాడు కాదు. ఆరోజున "మీ కంపెనీలో యేదేనా వుద్యోగంవుంటే మావాడికి యిప్పించవోయి!" అన్నాడు.

"ఇటువంటి కంపెనీ వుద్యోగాలు శర్మలాంటివాడికి కావు. చదువూ సంధ్యా లేని నాబోటివాడికి మాత్రమే" అన్నాడు కృష్ణారావు.

"అచ్చంగా మావాడి అభిప్రాయమూ అంతే. అందుచేతనే ఏ వుద్యోగంలేకుండా పోయింది." అని వెళ్ళిపోయేడు. కృష్ణారావు మాట్లాడలేదు. తర్వాత శర్మ లోపలినుంచి వచ్చేడు. మాటల సందర్భంలో కృష్ణారావు "నిన్న రాఘవరావు వరస చూస్తే నీకు లైనులో తటస్థపడ్డ అవారాకి వీడికీ అట్టే తేడా లేదనిపిస్తోంది. ఏదేనా తేడా వుంటే అది అంకాలలో మాత్రమే" అన్నాడు. తర్వాత అక్కడనుంచే బస్సెక్కి వెళ్ళిపోయేడు. రాఘవరావు కూడా వెళ్ళి తన పనిలో చేరేడు.

తర్వాత ఒకరోజున రంగారావు దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది హాటలు తిండితో ఆరోగ్యం పాడవుతోందనీ, అందుచేత విశాలాక్షిని తీసుకొని వెళ్ళదలచినట్లూ, అందుకు సిద్ధంగా వుండవలసిందనీ వ్రాసేడు. ఆ వుత్తరంలోనే తనతో బి. యే ప్యాసైన స్నేహితు డొకడు.. కాలేజీలో ట్యూటరుగా పనిచేస్తున్నాడని అతడు కారణాంతరాలచేత నాలుగు నెలలవరకూ శెలవు పెడుతున్నాడనీ శర్మ దరఖాస్తు చేస్తే తాత్కాలికంగా ఆ వుద్యోగం దొరకవచ్చునీ కూడా వ్రాసేడు ఆరోజే శర్మ దరఖాస్తు పంపించేడు

నాలుగోరోజున రంగారావు వచ్చేడు. విశాలాక్షి యేరోజు కారోజే తొందర పడుతోంది వెళ్ళిపోవటానికి. మర్నాడే రంగారావు విశాలాక్షీ పిలలు వెళ్లిపోయేరు. వాళ్లు వెళ్ళగానే సందడి పూర్తిగా తగ్గి యిల్లంతా చిన్నపోయింది ఇక యింట్లో వుండటం అసాధ్యమనుకున్నాడు శర్మ.

అదృష్టవశాత్తు రెండురోజులలో శర్మని కాలేజీలో ట్యూటరుగా నియమించినట్లు ఒక వారంరోజులలో పనిలో చేరాలని కాలేజీనుంచి వుత్తరువు వచ్చింది. దీనితో శర్మకి ఉద్యోగపు సమస్య తాత్కాలికంగా తీరింది ఆ కాలేజీవున్న వూళ్లోనే రాఘవరావు తాలూకా ఆఫీసులో పనిచేస్తున్నాడు. రాఘవరావుకు వెంటనే ఒక ఉత్తరం వ్రాసేడు. ఆ వూళ్లోవున్న కాలేజీలో ట్యూటరుగా వుద్యోగం వచ్చిందనీ, ఆ వూరు తనకు క్రొత్తకాబట్టి మొదటి రోజుల్లో తనకు ఆతిథ్య మీయవలసిందనీ వ్రాసేడు. కాని రాఘవరావుదగ్గరనుంచి యేవిధమైన సమాధానమూ రాలేదు. కృష్ణారావు పినతండ్రి కొడుకొకడు ఆ కాలేజీలోనే చదువుతున్నట్టు అతను కాలేజీ హాస్టలులో వుంటున్నటు శర్మకు తెలుసు. అతని రూంలో బసచేయవచ్చును కున్నాడు శర్మ. ఒక మంచిరోజు సుముహూర్తంలో బయలుదేరి వెళ్లేడు శర్మ.

[ఇంకావుంది]



హిందూ దేశమంతటా దొరకును

పెద్ద కథ:

# ఉద్యోగాలు

(గతసంచిక తరువాయి)

ఆ ఫూరు చేరేటప్పటికి చీకటైంది. స్టేషనునుంచి ఒక రిక్షా కట్టించుకొని కాలేజీ హాస్టల్‌కు వెళ్ళేడు. ఆ రాత్రికి హాస్టలులో గడిపి మళ్ళీ రోజున ప్రిన్సిపాల్‌ను చూసి తగినవైన యేర్పాటు చేసుకోవచ్చుననుకున్నాడు. ఎట్టి పరిస్థితులలోనూ రాఘవరావును మాత్రం కలుసుకోలేదు. అతనివల్ల తనకు సహాయమేమీ లభించదని తెలుసుకున్నాడు.

హాస్టలులో సుమారు ఏభై, అరవై గదుల వరకూ వున్నాయి. అదొక మొగపెళ్ళివారి విడిదిలాగ వుంది. కొన్ని గదులు తాళంవేసి వున్నాయి. కొన్ని గదులలో పదేసిమంది విద్యార్థులు కూర్చుని వాదించుకుంటున్నారు. శర్మ హోల్డాలు చంకలో పెట్టుకొని 'ఫలానా విజయసారథి రూమెక్కడ?" అని అడిగేడు. కొందరు తెలియదన్నారు. మరికొందరు ఏవేవో గదులనెంబర్లుచెప్పి ఆనవాళ్లు చెప్పేరు. ఒకసారి మేడమీదకు మరొకసారి క్రిందకు ఈవిధంగా రెండుమూడుసార్లు తిరగవలసి వచ్చింది. చివరకు అతికష్టంమీద తనకు కావలసిన "రూం"ని కనుక్కున్నాడు. రూంలో విజయసారథి లేడు. అతనిరూంలో వుండే యింకోవిద్యార్థి భోజనం పూర్తి చేసుకొని సమయానికి గది తాళం తీస్తున్నాడు. "విజయ సారథిరూం యిదేనా?" అన్నాడు శర్మ.

"ఔను. లోపలికి రండి" అన్నాడతను. తర్వాత "విజయ సారథి సినీమాకు వెళ్లేడు. పదిగంటలకుగాని రాడ"ని చెప్పేడు.

శర్మ హోల్డాలు గదిలో పెట్టుకొని "ఇప్పుడే వస్తాను" అని చెప్పి ఊళ్ళోకి బయలుదేరేడు. ఊరు చాలా పెద్దది. బజారులోవున్న వెల్‌కం హోటల్‌లో భోజనం చేసి తిరిగి రూంకి వచ్చేడు. విజయ సారథి సహాధ్యాయి ఒక పడకకుర్చీలో కూర్చొని సిగరెట్టు పీలుస్తూ ఒక వారపత్రికను తిరగవేస్తున్నాడు. శర్మ రాగానే లేచి టేబుల్ దగ్గరవున్న కఱ్ఱ కుర్చీవద్దకు వెళ్లి శర్మను పడకకుర్చీలో కూర్చోమన్నాడు. తర్వాత ఒక సిగరెట్టును శర్మకు అందియ్యబోయేడు. "థాంక్యూ అవసరం లేద"న్నాడు శర్మ. మళ్ళీ సిగరెట్టును పెట్టెలో చేర్చాడు విద్యార్థి.

తర్వాత శర్మ తను వచ్చినపని చెప్పేడు. దాంతో విద్యార్థికి అతనిపై గౌరవం యెక్కువైంది. చేతిలోవున్న సిగరెట్టు ముక్కను కిటికీగుండా అవతలకు విసిరేసి కఱ్ఱ కుర్చీమీద కూర్చున్నాడు. శర్మ తన కుర్చీని వరండాలోకి మార్చుకొని కాళ్ళను ఒక స్తంభానికిఆన్చి పడుకొని ఆలోచించటం మొదలుపెట్టేడు. రూంలోని విద్యార్థి మాత్రం నిశ్శబ్దంగా కూర్చొని వారపత్రికను తిరగేస్తున్నాడు. చుట్టుప్రక్కల కొన్ని గదులుతాళంవేసి వున్నాయి. బహుశా వారు కూడా సినిమాలకువెళ్లి వుండవచ్చును. లేదా ఇంకొకరి గదులలో గుమిగూడి వుంటారు. క్రిందిహాస్టల్ అరుపులతోటి ప్రతిధ్వనిస్తోంది. కొన్ని గదులలో విద్యార్థులు రాజకీయాలమీద వాదోపవాదనలు చేస్తున్నారు.

## జె. పరబ్రహ్మం

"ఫలానావారికి బుద్ధి యెంతమాత్రం లేదని అతను మంత్రిపదవికి యెంతమాత్రం పనికి రాడ"ని వాదిస్తున్నాడు. కేవలం తెలివితేటలు తన సొత్తేనని ఆ మంత్రిపదవి తనకే వస్తే అంతకంటె యేదో చేయగలనని అతని భావం. ఇంకొకడు ఇంకోవిధమైనపద్ధతిలో వాదిస్తున్నాడు. మొత్తంమీద వారందరికి వాదనలలో నెగ్గటానికి వాక్చాతుర్యం తెలివితేటలుకంటె స్వరంమీదే యెక్కువ నమ్మకం వున్నట్టు కనబడుతోంది. ప్రతివారూ మాట్లాడేవారే కాని వినేందుకు ప్రయత్నించేవా రొకరూ వున్నట్టు కనబడలేదు.

చాలాగదుల్లోంచి ఘాటైన సినిమా విమర్శనలు యెక్కువగా వినబడుతున్నాయి. "ఫలానా చిత్రంలో సురయా నటన ఎంతమాత్రం బాగుండలేదని, ఇంకొకచిత్రంలో యాకూబ్ 'ఓవర్ యాక్టు' చేసేడని, కథలో టెంపో లేదనీ, డైరెక్టరు చాలా అసమర్థుడని" మొదలైన సంభాషణలెన్నో వినబడుతున్నాయి. వారి సంభాషణలను బట్టి వారిలో చాలామందికి సినిమాలలో నటించాలనీ, లేదా దర్శకత్వం వహించాలనీ అభిలాష వున్నట్టు శర్మకు అర్థమైంది. "యేదోవిధంగా వారికి చేతనైనట్టుగా కళా సేవ చేయటమే వారి వుద్దేశ్యమైనట్టున కొందరు పైకి చెప్పేస్తున్నారు. అయితే సినిమాలలో నటించడంవల్ల, కామాన్నీ అర్థాన్నీ ఒకేసారి సేవించవచ్చున్న ఉద్దేశ్యం వారి ప్రతిమాటల్లోనూ శర్మకు కనపడుతూనే వుంది.

శర్మ కూర్చున్న వరండాకు యెదురుగుండా వున్న రూం కొంత నిశ్శబ్దంగా వున్నట్టు కనపడింది. అందులోని విద్యార్థులు చాల బుద్ధిమంతులైవుంటారనుకున్నాడు శర్మ. కాని యింతలోకే "డైమను త్రించాపెట్టి కోయవలసింది. కళావరు జాకీ దింపితే బాగుండేది" మొదలైన మాటలు బయలుదేరేయి. శర్మ నవ్వుకున్నాడు.

హాస్టలులో సినిమా గానప్రియులు హెచ్చుమందే వున్నట్టున్నారు. "సోజా రాజకుమారీ" పాటలతోటీ, "మేరా బుల్ బుల్ సోరహా హై" పాటలతోటీ కొన్ని గదులు మ్రోగిపోతున్నాయి. మొత్తంమీద హాస్టల్ అతిఅట్టహాసంగా వుంది. "చదువు నిమిత్తమై వచ్చినట్లు ఒకడుకూడా కనబడటం లేదు. వీరికా చదువు చెప్పటం?" అనుకున్నాడు శర్మ. "వీరిమీద దుర్వినియోగం చేసే డబ్బుని యే ప్రాజక్టుమీదనా వినియోగపరిస్తే దేశం అయిదురెట్లు యెక్కువ బాగుపడేది" అనుకున్నాడు.

"అయితే ఇదంతా యీ కొత్త ప్రపంచములో నవజీవనానికి కావలసిన పద్ధతులకు తర్ఫీదై వుండవచ్చు. ఇంతకంటె జాగ్రత్తగా చదివి తను సాధించిన దేమిటి? ఈ విధంగానే విద్యాభ్యాసం చేసిన రాఘవరావు సాధించకపోయిన దేమిటి? తనొకడే ప్రయోజకుడు, మిగతావారంతా అప్రయోజకులు అని యెవరికివారే అనుకొని రెండవ వారిని మోసగించటమే ఒక లక్ష్యంగా పెట్టుకొని జీవితంలో ముందుకు త్రోసుకొని పోవటమే ఈరోజుకు సరియైన పద్ధతి. ఈ పద్ధతిలో తనకు తర్ఫీదులేదు. అటువంటి పద్ధతులు నేర్చుకునే సమయం దాటిపోయింది. అయితే తను చేయవలసిం దేమిటి?"...

"ఈ చదువులో సారం లేదని ఈ విద్యార్థులు పూర్తిగా గ్రహించినట్లున్నారు. అది నిజమే కావచ్చు. ఫిఫ్తుఫారంవరకూ చదివిన కృష్ణారావు జీవితంలో తనకు అడు

గడుకూ యెదురయ్యే క్లిష్టమైన సమస్యల్ని అతి సులభంగా పరిష్కారం చేసికోగల్గుతున్నాడు. తనో, దానికి పూర్తిగా వ్యతిరేకం" ఈవిధంగా ఆలోచించుకుంటూ పడుకున్నాడు.

తర్వాత విజయసారథివచ్చి శర్మని గుర్తించేడు. ఆరాత్రి హాస్టలులో గడిపేడు శర్మ. మర్నాడుదయం కాఫీ టిఫిన్లు హాసల్‌లోనే తీసుకున్నాడు. పదిగంటలకు కాని కాలేజీ ప్రారంభించరు. ఈలోగా ఆ గదిలోవున్న విద్యార్థులకు 'షారాబ్ అండ్ రుస్తుం'లో కొన్ని ఏనొటేషన్లు వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డులోని బర్చిల్ శీలం మీద ఒక వ్యాసం వ్రాసియిచ్చేడు.

తొమ్మిదిన్నరకు సరిగా కాలేజీకి వెళ్ళేడు. ఒక అరగంటకు ప్రిన్సిపాల్ వచ్చేడు. శర్మ ప్రిన్సిపాలుదగ్గరకు వెళ్ళి తను ఫలానా శర్మనని చెప్పుకొని కాలేజీలో ట్యూటరుగా నియమిస్తూవున్న ఉత్తరువును చూపించేడు.

ప్రిన్సిపాల్ తన టేబుల్‌కి యెదురుగా వున్నకుర్చీ చూపించి కూర్చోమన్నాడు. ఆయన శర్మయొక్క విలువని గ్రహించినట్టున్నాడు. శర్మవంటివాడు తమ కాలేజీకి రావటం చాల సంతోషంగావుందన్నాడు. ట్యూటరు వుద్యోగం తాత్కాలికమైనప్పటికీ వచ్చే సంవత్సరం కాలేజీలో క్రొత్త కోర్సులు ప్రారంభించబోతున్నామనీ ఒక లెక్చరర్ వుద్యోగం ఖాళీ వస్తుందని ఆ పనిని శర్మకే ఖాయం చేయగలమనీ కూడా చెప్పేడు.

తలవనితలంపుగా వచ్చిన ఈ అదృష్టానికి శర్మ చాలా సంతోషించేడు. కేవలం పైవేషంతో నిమిత్తంలేకుండా తన విలువని గుర్తించే వ్యక్తి ఇప్పటికి తనకు కనపడ్డాడు. శర్మహృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. పైకిమాత్రం యేమీ మాట్లాడలేకపోయేడు.

"చాలాకృతజ్ఞుణ్ణి"అనిమాత్రంఅన్నాడు.

తర్వాత ప్రిన్సిపాల్ వారానికి నాలుగు గంటలుమాత్రమే మీకు పని వుంటుంది. ఈరోజు మీకు పనిలేదు. రేపు మీటయింకువచ్చి మీపనిని చూసుకోవచ్చును" అన్నాడు. ఆరోజు పనిలో జేరినట్టు శర్మ సంతకంపెట్టి వూళ్లోకి బయలుదేరేడు. గత రాత్రి వెళ్ళిన వెల్కంహోటలుకే భోజనానికి వెళ్ళేడు. కాని అన్నం హితవుగా లేదు. ప్రొద్దుట హాస్టలులో తీసికొన్న టిఫిన్‌వల్లనో, లేక హోటల్ తిండి తత్వమో కాని వికారంగా వుంది. అసంపూర్తి భోజనంచేసి మళ్ళీబజారులోకి వచ్చేడు. యేదేనా ఒకబస యేర్పాటు చేసుకోవాలి. నాలుగైదు వీధులు తిరిగేడు. కానీ, అర్థం లేకుండా తిరిగితే వస్తీలో బస యెక్కడా దొరుకుతుంది. యెండలో తిరగటంవల్ల తలా, వళ్లు వేడెక్కినటయింది మళ్ళీ కాలేజీకి జేరేడు. అక్కడ స్టాఫ్‌రూంలో ఒక కుర్చీలో జార్లబడి కూర్చున్నాడు. స్టాఫ్‌రూంలో ఇంకొకాయన కూడా కూర్చొని కాగితం మీద యేవేవో వ్రాసుకుంటున్నాడు. ఆయనకూ శర్మవయస్సే వుంటుంది. ఆకాలేజీలో మేథమెటిక్స్ డిపార్టుమెంటులో పని చేస్తున్నానని చెప్పేడు. శర్మ తన విషయం కూడా చెప్పుకొని ప్రస్తుతం బస యేదేనా కుదుర్చుకునే ప్రయత్నంలో వున్నానని చెప్పేడు.

"ఈవూళ్ళో రూమ్స్ దొరకటం చాల కష్టమండీ. ఏమైనా హాస్టల్‌లో మాత్రం ఇక వుండకండి. ఈ రాత్రికి మీకెక్కడ బస దొరక్కపోతే మారూంకి వచ్చేయండి. నేను ప్రస్తుతం వంటరిగా నేవుంటున్నాను" అన్నాడాయన.

"మీ ఉపకారబుద్ధికి యెంతో కృతజ్ఞుణ్ణి" అన్నాడు శర్మ.

శర్మ ఒక గంటసేపు విశ్రాంతి తీసుకొని మళ్లీ బయలుదేరేడు. వళ్లంతా నొప్పులుగా వుంది. ఒకరిక్షా చేసుకొని కొన్ని వీధులు తిరిగేడు. తిరిగినంత మాత్రంలో గదులు దొరికేటట్టు లేవు కొందరు గదులు ఖాళీ లేకపోయినప్పటికీ తాత్కాలికమైన ఏర్పాటేవో చేసి అద్దెకు యిస్తామన్నారు. కాని వారు అద్దె నలభై, యాభై రూపాయలు చెబుతున్నారు.

సాయంత్రం రాఘవరావు సైకిల్ మీద వెడుతుండగా కనపడ్డాడు. ఒక వదులైన పైజమా, పొడుగాటి చొక్కాపైన ఒక కోటు వేసుకొనివున్నాడు. శర్మ అతనిని పిలువలేదు. రాఘవరావు కూడా శర్మని చూడనట్టు నటించి వెళ్ళిపోయేడు. తల నొప్పి యెక్కువగా వుంది దగ్గరలోవున్న సెంట్రల్ కేఫ్‌కి వెళ్ళి కాఫీ పుచ్చుకున్నాడు. కాఫీ కూడా నోటికి కంతమాత్రం హితవుగాలేదు. ఇక తిన్నగా హాస్టలులోని విజయసారథి రూంకి జేరేడు.

తలవని తలంపుగా కృష్ణారావు అక్కడ కనపడ్డాడు. అతనుకూడా ఆ విద్యార్థులకు యేవేవో చెబుతున్నాడు. శర్మని చూడగానే తనప్రసంగం ఆపివేసి సంతోషంతో శర్మని అభినందించేడు. కంపెనీ పనిమీద వచ్చినట్లు ఒకటి రెండు రోజులు తనావూళ్ళోనే వుంటాననని చెప్పేడు. ఆరాత్రికి తనతోబాటు ఆ 'రూం'లోనే వుండమన్నాడు.

శర్మ రాఘవరావు తన ఉత్తరానికి సమాధాన మీయలేదని ఈ వూళ్ళో కనబడి కూడా చూడనట్టు నటించి వెళ్ళిపోయేసరి చెప్పేడు.

"వాడంతేలే" అన్నాడు కృష్ణారావు.

"రేపు నిన్ను మళ్ళీ కలుసుకుంటాను. ఈ పూటకి శలవు" అన్నాడు శర్మ.

తర్వాత సైకిల్ రిక్షాలో హోల్డాల్ పెట్టించుకొని మేథమెటిక్స్ లెక్చరర్ యిచ్చిన చిరునామా వెతుక్కుంటూ అతని రూంకు చేరేడు. ఆ పూటకు తన కారియర్‌తో శర్మకు కూడా భోజనం తెప్పిస్తానన్నాడు.

"నో. థాంక్యూ. ఈపూట నాకాకలిగా లేదు" అన్నాడు శర్మ. కారియర్ తెచ్చే కుఱ్ఱవాడితో రెండు బత్తాయి పళ్ళు తెప్పించుకున్నాడు.

లెక్చరర్ ఏవో కాగితాలు ముందువేసుకొని కూర్చున్నాడు. శర్మకుమాత్రం వళ్ళు తెలియనంత బాధగావుంది. హోల్డాలు వాల్చి లెక్చరర్‌తో మాట్లాడుతూ పడుకున్నాడు. లెక్చరర్ మాటల సందర్భములో తను ఐ. ఏ. ఎస్ పరీక్షకు వెడుతున్నానని చెప్పేడు.

"దరఖాస్తు చేయటానికి యింకా యెంత టైముందీ?" అన్నాడు శర్మ.

"మీరు దరఖాస్తు చేయదల్చుకుంటే నా దగ్గర ఇంకొక అప్లికేషను ఫారం కూడా వుంది" అన్నాడాయన.

డ్రాయరులోంచి ఇంకొక ఫారంతీసి శర్మకిచ్చేడు. శర్మ లేచి టేబుల్ లైటు దగ్గర కూర్చొని ఫారం పూర్తిచేసేడు.

"దరఖాస్తును రేపు పంపించివేద్దా మన


సకల దంత వ్యాధులకు

కోతిమార్కు

నల్ల పండ్లపొడి



ప్రతిచోట దొరకును.

నోగి అండ్ కో

87 చైనాబజార్ రోడ్, మద్రాసు-1

బెజవాడ స్టాకిస్టులు: ట్రేడ్ ప్రమోటింగ్ కార్పొరేషన్, పోస్టుబాక్సు నెం. 50 గాంధీనగరం.

# ★ ఉద్యోగాలు ★

కుంటున్నాను" అన్నాడు లెక్చరర్.

"మీరు శ్రమ అనుకోకుండావుంటే నా దరఖాస్తును కూడా మీ దానితోపాటు పంపించమ"న్నాడు శర్మ.

"ఇందులో శ్రమేమివుంది?" అన్నాడు లెక్చరర్.

శర్మ హోల్డాలులోంచి ఒక పెద్ద కవరు తీసి దానిలోంచి తన యం ఏ సర్టిఫికేటు కావలసిన యితర యోగ్యతాపత్రాలు ఆయనకు యిచ్చేడు. "చెలాన్ ఇంపీరియల్ బాంక్ లోకట్టి 'టైంకు' అందిస్తానని" చెప్పేడు.

అయితే శర్మదగ్గర ముప్పై రూపాయల కంటె యెక్కువలేవు. కృష్ణారావుదగ్గర అప్పు తీసుకుందామనుకున్నాడు. ఒకవేళ అతను సర్దుబాటు చేయకపోతే తన దగ్గర వున్న రెండు ఉంగరాలు అమ్మివేద్దామను కున్నాడు. పరీక్షఫలితా లెట్లాగవున్నా వుంగరాలు మాత్రం మాయమవుతాయి.

ఆరాత్రి శర్మకు యేమీ నిద్రపట్టలేదు. తెల్లవారినా ప్రక్కనుంచి లేవాలనిలేదు. బలవంతంగా లేచి మొహం కడుక్కున్నాడు. లెక్చరర్ కుఱ్ఱవాడిచేత రెండు కప్పుల కాఫీ ఫ్లాస్కుతో తెప్పించేడు. శర్మ కాఫీ త్రాగి మళ్ళీ హోల్డాలుమీదకు చేరేను.

"స్నానం చేస్తారా?" అన్నాడు లెక్చరర్.

"నాకు చలిగావుంది. స్నానం చేయలేను" అన్నాడు శర్మ.

తొమ్మిదిన్నరకు లెక్చరర్ డబుల్ కారియర్ తెప్పించేడు. అన్నం ముద్ద నోట పెట్టుకోలేకపోయేడు శర్మ.

"చాలా మొహమాటం పడుతున్నట్టున్నారు" అన్నాడాయన.

"లేదండీ. యెందుకో సహించటం లేద"న్నాడు శర్మ.

భోజనం అయిందనిపించి శర్మ రిక్షామీద కాసలుకు బయలుదేరేడు. కృష్ణారావు సరిగ్గా అప్పుడే బజారునుంచి తిరిగి వస్తున్నాడు. చేతిలో లెదర్ బ్యాగ్, ఫుల్ సూటు, నెక్టయి వగైరాలతో పెద్ద ఆఫీసరులాగ వున్నాడు.

"నావుద్యోగానికి వేషమే ముఖ్యం" అన్నాడు కృష్ణారావు నవ్వుతూ.

తర్వాత శర్మ తనకొక యాభైరూపాయలు అవసరమని ఉంగరాలు అమ్మివేయ దలచుకున్నానని చెప్పేడు.

'నీకేమన్నా మతిపోయిందా యేమిటి? ఆమాత్రం నేను సర్దుబాటు చేయగలనులే" అన్నాడు కృష్ణారావు.

"పెద్ద సంసారాన్ని ఈదుతున్నావు నీకెందుకీశ్రమ." అన్నాడు శర్మ.

"నెలాఖరుకు నీకు జీతంరాగానే కొంత తీర్చివేయవచ్చు. ఈలోగా నాకేమీ ఇబ్బంది వుండదులే" అన్నాడు కృష్ణారావు.

కృష్ణారావు తనకు ఇంపీరియల్ బ్యాంకులో పనివుందని, శర్మపేర చలాన్ కట్టి మేథమెటిక్స్ లెక్చరర్ రూంలో యిస్తానని చెప్పేడు.

'నీసహాయాన్ని వేయిజన్మల్లో కూడా తీర్చుకోలేను" అన్నాడు శర్మ.

"ఇంతకంటె యెక్కువ సహాయం తీసుకున్నవాళ్ళున్నారుకాని ఎవరూ ఇటువంటి మాటలు ఇంతవరకూ అనలేదు" అన్నాడు కృష్ణారావు.

"నేను కాలేజినుంచి నాలుగు గంటలకు వచ్చి సెంట్రల్ కేఫ్‌లో నీకోసం యెదురు చూస్తూ వుంటాన"న్నాడు శర్మ. "సరే" అన్నాడు కృష్ణారావు.

తర్వాత శర్మ కాలేజీకి వెళ్లేడు. తను సామాన్యంగా యెక్కడకు వెళ్ళినా నడిచి వెళ్ళటం మామూలు. ఈరోజునమాత్రం నడవలేకపోయేడు. ప్రొద్దుటనుంచి యెక్కడకువెళ్ళినా రిక్షామీదే ప్రయాణం. తన టైంప్రకారం క్లాసులోకివెళ్లేడు. క్లాసులో విద్యార్థులు పదిమందికిలోపుగా వున్నారు. "ఈ పీరియడ్ మాష్టారు సెలవుమీద వెళ్ళేరని తెలిసి స్టూడెంట్సు అందరూ ఇళ్ళకు పోయేరు" అని ఒకడన్నాడు. ఈవిధంగా జరుగుతుందని తెలుసు. క్లాసు వుంటుందా, వుండదా అన్న సందేహం వచ్చినప్పుడు వుండదు అన్న నిర్ణయానికే విద్యార్థులు మొగ్గు చూపిస్తారు. ఆ పదిమందిచేత కాంపోజిషన్ వ్రాయించి వారి పుస్తకాల్ని వారి యెదుటే తప్పులుదిద్ది వారికిచ్చివేసేడు.

నాలుగు గంటలకు సెంట్రల్ కేఫ్‌కు చేరేడు. అప్పటికే కృష్ణారావువచ్చి శర్మకోసం యెదురు చూస్తున్నాడు.

చలాన్ కట్టి రసీదు మేథమెటిక్స్ లెక్చరర్‌కి యిచ్చేనని చెప్పేడు.

"టైంకి అందించావా?" అన్నాడు శర్మ.

"ఆ. ఈవేళే రిజిష్టరుచేసి పంపుతానన్నాడు మీ ఫ్రెండ్" అన్నాడు కృష్ణారావు

శర్మ కాఫీత్రాగలేక అంతావదిలివేసేడు. కొంచెం మించు మించుగా యేభైమైళ్ల ఆహారం లేకుండా మూడురోజులనుంచి గడుపుతున్నాడు.

"అయితే ఇంకొక పని మిగిలివుంది" అన్నాడు శర్మ. "ఏమిటది?" అన్నట్టు చూసేడు కృష్ణారావు

"రేపు నాకు క్లాసులేదు. అందుచేత శెలవు పెట్టదలచుకున్నాను. ఎల్లుండి శనివారం శెలవు. తర్వాత ఆదివారం. అందుచేత రేపుదయం ఇంటికివెడతాను. ఈలోగా ఒకరూం చూసుకొని తాళం వేసుకొని వెళ్ళాలి." అన్నాడు శర్మ.

"యేమంతతొందర?"

"యేమో. ఇల్లువదిలి చాలారోజులైనట్టుంది. ఇల్లువదలినతర్వాత ఒక్క మెతుకు కూడా సహించలేదు. అదికాకుండా డబ్బు తెచ్చుకుంటే కాని ఈనెల గడపటం కష్టం"

"నాకుకూడా వూళ్ళోపని పూర్తయింది. ఇద్దరం కలిసి వెతుకుదాం" అన్నాడు కృష్ణారావు.

శర్మ బద్ధకంగా నడకసాగించేడు. కృష్ణారావు మాత్రం ధైర్యంగా ప్రతియింటిలోకి వెళ్ళి "గదులు ఖాళీగావున్నాయా?" అంటూ వాకబుచేస్తున్నాడు. చాలమంది ఖాళీలు లేవన్నారు.

ఒక యింటి యజమాని ఒక గదిని చూపించేడు. ఆ గదికి గాలికాని వెలుతురుకాని వచ్చే సావకాశం యెంతమాత్రం లేదు. అయితే లైటంగువుంది. ఇతర సదుపాయాలేవీ లేవు. పంపుదగ్గర నీళ్ళు పోసుకోవచ్చునని పాకీ దొడ్డిమాత్రం ఉమ్మడి అని యజమాని చెప్పేడు.

"అద్దెంత?" అన్నాడు కృష్ణారావు.

"నలభైఐదు రూపాయలు" అన్నాడు ఆయన శర్మ "ఇక ఆలోచించక్కర్లేదు. వెళ్ళిపోవచ్చును" అనుకున్నాడు.

"మేము విద్యార్థులం కాము" అన్నాడు కృష్ణారావు యజమానితో.

"విద్యార్థులైనా కాకపోయినా అద్దె అంతే. బ్రహ్మచారుల కందరికీ ఒకే రేటు" అన్నాడాయన.,

"మేము బ్రహ్మచారులం కాము. అతనికి ఒక మొగపిల్లవాడు, నాకు మొగా, ఆడా, అందరూ కలిసి అరడజనుమంది పిల్లలున్నారు" అన్నాడు కృష్ణారావు.

"అయినా సరే మీరు కుటుంబాలు తెచ్చుకోవటంలేదు. అంతకు తక్కువకిచ్చేదిలేదు." అన్నాడు యింటి యజమాని.

"మీరు ఇయ్యకపోయినా మాకు సంతోషమే కాని మమ్మల్ని బ్రహ్మచారులని మాత్రం అనద్దు" అన్నాడు కృష్ణారావు.

శర్మకు నిల్చునే ఓపికకూడా క్షీణించింది. "రావోయి. ఇక వెళదాం. ఒక వేళ

ఆయన దయదల్చి అయిదురూపాయలు తగ్గించినప్పటికీ నేను యిచ్చుకునే స్థితిలో లేను. అందుచేత వాదన అనవసరం." అని ద్రాగితీసేడు. కృష్ణారావుకూడా శర్మవెంట వచ్చేడు. దారిలో కృష్ణారావు "విద్యార్థులకో రేటు కుటుంబీకులకో రేటు వుంటుంది" అన్నాడు.

"సబబే" అన్నాడు శర్మ. వాస్తవ పరిస్థితులు తను స్వయంగా చూసేడు. విద్యార్థులకు గదు లివ్వటంలో రకరకాలైన ప్రమాదాలు వున్నాయి. ఆ ప్రమాదాలను యెదుర్కొనే నిత్యమై అద్దెకాకుండా కొంత ఛీమారుసుము క్రిందకూడా వసూలు చేయవలసి వుంటుంది.

ఇక శర్మనడవలేనన్నాడు. కృష్ణారావు చేయి పట్టుకున్నాడు.

"వళ్లు వేడిగా వున్నట్టుందే?" అన్నాడు కృష్ణారావు.

"అయితే ఈరాత్రికి ఇంటికి ఉడాయిస్తాను" అన్నాడు శర్మ.


"నన్నుకూడా వెంట రమ్మంటావా?" అన్నాడు కృష్ణారావు.

"అక్కర్లేదు" అన్నాడు శర్మ. ఇద్దరూ గుఱ్ఱపుబండీ చేయించుకొని లెక్చరర్ రూంకి వెళ్ళేరు. లెక్చరర్ అప్లికేషన్లు రెండూ పంపించివేసేనన్నాడు. శర్మ ఇంటికి వెళ్ళవలసిన పనివున్నదని చెప్పి మర్నాటికి మట్టుకు శలవుచీటి వ్రాసి ఆయనకు యిచ్చేడు. తర్వాత ఆయనతో "మీ కెంతో ఋణపడి వున్నాను. మీ సహాయానికి కృతజ్ఞత యేవిధంగా చెప్పుకోవాలో కూడా తెలియటం లేదు." అని ఇంగ్లీషులో అన్నాడు. ఆయన నవ్వేడు. తర్వాత కృష్ణారావే శర్మ హోల్డాలు బండీలో పెట్టేడు. ఇద్దరూ బండియెక్కి స్టేషనుకు వెళ్లేరు:

కృష్ణారావు తనకో ప్లాట్‌ఫారం టిక్కట్టు, శర్మకు రైలుటిక్కట్టు తెచ్చేడు. శర్మ రైలు యెక్కేడు. లోపల కూర్చునేందుకు మాత్రమే చోటువుంది. కృష్ణారావు లోపలికెక్కి హిందూస్తానీలో గుక్కతిప్పుకోకుండా ఏవేవో మాట్లాడేడు. కొందరు తప్పుకొని శర్మకు ఇంకా కొంచెము చోటిచ్చేరు. కృష్ణారావు శర్మ హోల్డాలు పరిచి పడుకోమన్నాడు. తర్వాత కృష్ణారావు దిగిపోయేడు.

శర్మ రైలులో కృష్ణారావును గురించి ఆలోచించటం మొదలుపెట్టేడు. కిందటి జన్మలో యేదో సంబంధం వుండితీరాలి. లేకపోతే తనమీద ఇంత అభిమానం ఎందుకు వుండాలి? తనూ అతనూ చిన్నప్పుడు ఒక క్లాసు చదివేరు. అయితే రెండవ ఫారం లోనే విడిపోయేరు కాని వారి స్నేహం మాత్రం విడిపోలేదు. కృష్ణారావుని అందరు ఒక రౌడీక్రిందా తనను ఒక అమాయకుడిక్రిందా జమకట్టేరు. కృష్ణారావు హృదయం ఎటువంటిదో యెవరూ గ్రహించలేకపోయేరు.

రాఘవరావు ప్రకృతి యితనికి పూర్తిగా భిన్నం. పెద్దమనిషిక్రింద చలామణీ అవుతున్నాడు. నిజానికి కృష్ణారావుతో పోల్చిచూస్తే గొన్నో రెట్లు దుర్మార్గుడు. కృష్ణారావు జీవితం సుఖంగా గడుపుకుంటున్నాడు. నెలకు మూడు నాలుగు వందలు తెచ్చుకుంటున్నాడు. అంతర్వాహినిగా వున్న అతని గుణసంపదే దానికి కారణమై వుండవచ్చు. కృష్ణారావు మనుష్యులలో



# ★ ఉద్యోగాలు ★

వున్న బలహీనతను ఇట్టే పోల్చివేయగలడు. దుష్టులతో యెట్లాగ వుండాలి, మంచివాళ్ల దగ్గర ఎట్లాగ నడుచుకోవాలి మొదలైనవి అతనికి తెలుసు. కొందర్ని పొగిడి వశపర్చుకోగలడు. కొందర్ని భయపెట్టి లొంగదీయగలడు. అతని శక్తి తప్పకుండా అసాధారణమైనది. గడిపేడు. తను దిగవలసిన స్టేషను రాగానే హోల్డాలు సర్దుకుని దిగిపోయేడు.

అప్పటికి రాత్రి రెండు గంటలైంది. అక్కడనుంచి కారెక్కి తన వూరు చేరాలి. కారు స్టేషనుదగ్గరనుంచి నాలుగు గంటలకు బయలుదేరుతుంది. అంతవరకూ స్టేషనులో గడపాలి. ప్లాట్ ఫారందాటి వరండాలోకి వచ్చేడు. వరండా నిద్రపోయేజనంతో నిండి వుంది. యేవిధమైన పంచాలేనివారుపడుకునేందుకు యిక్కడకు వస్తుంటారు. బెంచీలమీద కొందరు నిద్రపోతున్నారు. భరించలేనంత చలిగావుంది. నేలమీదే హోల్డాలుపరిచి ఒక దుప్పటీ కప్పుకొని పడుకున్నాడు.

తర్వాత కారెక్కి తెల్లారకుండానే యిల్లు చేరేడు.

శర్మ తన ఉద్యోగవార్తలన్నీ టూకీగా చెప్పేడు. వచ్చేయేడు లెక్చరర్ వుద్యోగం వచ్చే సావకాశం కూడా వుందన్నాడు. అయితే ఐ. ఏ. ఎస్ పరీక్షకు దరఖాస్తు చేసినట్టుగాని ఏభై రూపాయలు అప్పు చేసినట్టుగాని చెప్పలేదు: తల్లిమాత్రం "అబ్బాయి బాగా నలిగిపోయేడు. అసలు అన్నంతింటున్నాడో లేదో" అంది. "పాపం. పొట్టకోసం పరాయిచోటుకివెళ్లి అవస్థలు పడవలసివస్తోంది" అనుకుంది. శర్మమాత్రం మాట్లాడకుండా ఒక మంచంమీద చేరి దుప్పటీ కప్పుకొని పడుకున్నాడు. అతనికి గాఢనిద్రలాగ పట్టింది. మర్నాడుదయం ఎనిమిదిగంటలైనా లేవలేదు. రాత్రంతా నిద్రలేదు కాబోలు. కాసేపాగి లేపుదామనుకున్నారు.

"మొహం కడుక్కొని స్నానం చేస్తే నిద్ర బద్ధకమంతా తీరిపోతుంది. భోజనం చేసి సాయంత్రంవరకూ పడుకోవచ్చును" అని రాజ్యం శర్మను లేపటానికి వచ్చింది. శర్మ వళ్లు చుఱ్ఱున కాలుతోంది. కంగారుపడి వెంటనే ఈ సంగతి అత్తగారితో చెప్పింది. ఆమె చేతిలోవున్న పనిని వదిలేసి ఇంకా కంగారుగా శర్మదగ్గరకు వచ్చింది. ఈ హడావుడి అంతా చూసి శర్మ తండ్రి కూడా వచ్చేడు. అందరూ భయపడ్డారు. శర్మను లేపేరు. శర్మకళ్లు యెఱ్ఱగా కొవ్వొత్తుల్లాగ వున్నాయి.

ఒక్కగానొక్క కొడుకు. ఉద్యోగమని పేరుపెట్టి పీడిప్రాణాన్ని నిష్కారణంగా తీసేస్తున్నామా? అనిపించింది. "ఉద్యోగం లేకపోతే అందరితోపాటే గంజో అంబలో త్రాగి ఇంటిదగ్గరే పడివుంటాడు. ఉద్యోగంకోసం బలవంతంగా గెంటేము" అని బాధ పడిందితల్లి.

"రాకరాక ఉద్యోగం రావటమేమిటి? ఈ జ్వరమేమిటి? గ్రహచారం కాకపోతే" అనుకున్నాడు తండ్రి.

రాజ్యానికి యేమనుకోటానికీ వీల్లేకుండా మనస్సు పూర్తిగా చెదిరిపోయింది.

"త్వరగా వెళ్లి డాక్టరును తీసుకురాండి" అంది తల్లి. కండువా వేసుకొని వెళ్లేడు తండ్రి. ఈలోగా శర్మకు మంచందగ్గిరే మొహం కడిగించి కాఫీ కాచియిచ్చేరు. తర్వాత శర్మ మళ్ళీ పడుకున్నాడు. డాక్టరు పదకొండుగంటలకు వచ్చిచూసేడు.

"ఆసుపత్రికి రాండి. మందిస్తాను. ఈ పూటకు కాఫీ హార్లిక్సు తప్ప మరేమీ ఇయ్యవద్దు" అన్నాడు. శర్మ తండ్రివెళ్ళి మందూ, హార్లిక్సు మొదలైనవి తీసికొని వచ్చేడు.

ఇక ఆరాత్రి శర్మ ఈ మానవప్రపంచంలో లేడేమో అనిపించింది.

ఇష్టమొచ్చినట్లు యేవేవో పలవరిస్తున్నాడు. "కాలేజీ - అప్లికేషను, యాభై రూపాయలు మొదలైనవెన్నో అసందర్భమైన మాటలు మాట్లాడుతున్నాడు. అప్పుడప్పుడు 'కృష్ణారావు, కృష్ణారావు,' అని గట్టిగా అరుస్తూ మంచంమీదనుంచి లేచి వెళ్ళబోయేడు. తల్లీ తండ్రీ అతనిప్రక్కనే కూర్చునివున్నారు. రాజ్యం దూరంగా పోయి యేడుస్తూ పడుకుంది.

తెల్లవారిన తర్వాత మళ్ళీ డాక్టరువచ్చి చూసేడు. అందరూ ఆతురతగా వున్నారు. "అబ్బాయిని బ్రతికించి పుణ్యం కట్టుకోండి. మీ ఋణం యేదో విధంగా తీర్చుకుంటాం." అంది తల్లి.

"టైఫాయిడ్ జ్వరం, తగ్గటానికి మూడు వారాలు పడుతుంది. మీరు తొందరపడితే లాభంలేదు" అన్నాడు డాక్టరు.

"ఎప్పటికో అప్పటికి అసలు తగ్గితే చాలు" అన్నాడు తండ్రి.

"లంకణాలు అతి కఠినంగా చేయించాలి" అన్నాడు డాక్టరు.

అసలు యేమి ఇచ్చినా వుమ్మేస్తున్నాడు శర్మ.

డాక్టరు వెళ్ళిపోయిన తర్వాత మధ్యాహ్నం శర్మ తల్లి ఒక నాటువైద్యుణ్ణి పిలిపించింది. వాడు వచ్చి శర్మ చేయిచూసి మాట్లాడకుండా వెళ్ళిపోయేడు. శర్మ తల్లి ఒక్కసారి ఘొల్లుమంది. కంగారుగా తండ్రి లోపలకు వచ్చేడు. జరిగిన సంగతి తెలుసుకొని "వాడి మొహం. ఇటువంటి వాళ్లని యెందుకు పిలుస్తావు?"అని చివాట్లు వేసేడు. "ఒక సమర్థుడైన డాక్టరు వచ్చి చూస్తున్నాడు. భగవంతుని మీద భారంవేసి ఆయన్నే నమ్ముకుందాం" అన్నాడు.

ఆనాటి రాత్రి ఉధృతం మరీ యెక్కువైంది. డాక్టరును వెంటనే తీసుకొని రమ్మనమని యింటిలోనివారి పోరు యెక్కువైంది. "డాక్టరు దేవుడా యేమిటి ఒక్కసారిగా జ్వరాన్ని తీసివేయటానికి. ఓపిక పట్టాలి" అన్నాడు తండ్రి.

"ఓపిక మాకు లేదు. వెళ్ళి తీసుకురావలసిందే" అంది తల్లి. గత్యంతరంలేక వెళ్లేడు తండ్రి చీకట్లో.

డాక్టరుగారి యింటిదగ్గర కుక్క మీదపడి కరచినంత పనిచేసింది. ఆ సందడికి డాక్టరుగారు లేచేరు. శర్మ తండ్రి యింటిదగ్గర పరిస్థితులన్నీ చెప్పి "ఒక్కసారి వెంటనే దయచేయవలసిందనీ, గుర్రపుబండీని తీసుకొనివస్తానని" ప్రాధేయపడ్డాడు. డాక్టరుగారు నెమ్మదిగా ఆవులిస్తూ 'యేమీ కంగారులేదు. రేపు నేను వచ్చి చూస్తాను. మీరు వెళ్లండి"అన్నాడు.

డాక్టరుకు కంగారులేని మాట నిజమే కాని తమకు లేకుండా యెక్కడకు పోతుంది? శర్మ తండ్రికి కోపము వచ్చింది. ఇక మాట్లాడలేకపోయేడు.

"చిత్తం. అల్లాగే. తప్పకుండా ఉదయమే ఒకసారి దయచేయండి" అన్నాడు.

"తప్పకుండా వస్తాను" అన్నాడు డాక్టరు.

ఈలోగా ఇంటిదగ్గర పరిస్థితి మరీ అయోమయంగా వుంది. వాళ్ళు అనుక్షణం

అమృతమువంటి
అనంగప్రభాయాకుతి
సుందరమైన యౌవ్వనానికి. ప్రకాశవంతమైన తేజస్సుకు. ఉత్తమమైనది. ధాతువును గట్టిపరచి వృద్ధిచేయును. బలహీనతచెందిన నరములకు శక్తిని. పటుత్వమును చేకూర్చును. సుఖమైన దాంపత్యజీవితమునకు ఉత్తరవాదముగలసంజీవి.
30 మాత్రలు రు. 10, 15 మాత్రలు రు. 5.
మదనమంజరి ఫార్మసీ
184, చైనాబజారు రోడ్డు. మద్రాసు-1.
బెజవాడ-శ్రీనివాస మెడికల్ స్టోర్సు-పార్కురోడ్డు
రాజమండ్రి-ఈశ్వరదాస్ & కో. మెయిన్ రోడ్డు
వెల్లూరు:- అర్యన్ ఫార్మసీ-ట్రంకురోడ్డు.
ఇతర కేంద్రాలల్లో ఏజెంట్లుకావాలి

ఒక పత్రికా సంపాదకుడు సంపాదకీయం వ్రాయడానికి విషయమేమీ దొరక్క, బైబిలులోని దశనిబంధనలను (టెన్ కమాండ్‌మెంట్సు) సంపాదకీయ స్థానంలో అచ్చువేశాడు. మరునాడు ఒక పాఠకుడు ఇలా వ్రాశాడు: "నిన్నటి మీ సంపాదకీయం కొందరు వ్యక్తులను మనస్సులో పెట్టుకుని వ్రాశారు. కనుక నేను కట్టిన చందా యింతవరకూ లెక్క చూచి మిగతాది పంపివేయవలెను."

—"రవి"

డాక్టరుకోసం యెదురు చూస్తున్నారు. క్షణం ఒక యుగంలాగ గడుస్తోంది. ఆరాత్రి శర్మ యిక వారికి దక్కడేమో అనిపించింది.

చివరకు డాక్టరు లేకుండా శర్మ తండ్రి ఒక్కడే వచ్చేడు. ఇక వారి ఆవేదన చెప్పటానికి వీల్లేదు. "ఎప్పుడు తెల్లారుతుందా" అని కనిపెట్టుకొని కూర్చున్నారు. యెంతకీ తెల్లవారకుండా వుంది.

ఉదయమే డాక్టరు వచ్చేడు. శర్మను పరీక్షచేసి డెబ్భయి రూపాయల మందుల జాబితా ఒకటి తయారుచేసి శర్మ తండ్రికిచ్చి వాటిని అర్జంట్‌గా తెప్పించమన్నాడు. ఐస్ తెప్పించి మొహంమీద వేయమన్నాడు. మళ్ళీ మధ్యాహ్నం వచ్చి చూస్తానని డాక్టరు వెళ్ళిపోయేడు. శర్మ తండ్రి ఒక కుర్రవాడిని సైకిల్ మీద పక్కనున్న బస్తీకి పంపి అర్జంటుగా మందులన్నీ తెమ్మన్నాడు. తల్లి "ఇక్కడున్నట్టుగా రావాలి" అని గట్టిగా చెప్పింది.

మందులు తీసుకొని కుర్రవాడు పదకొండు గంటలకు వచ్చేడు. వాటిలో నాల్గు రకాలైన మాత్రలు అనేక యింజక్షను బుడ్లు వున్నాయి. ఒక అరగంటలో డాక్టరు వచ్చేడు. ఆ మాత్రలు వేసే క్రమాన్ని చెప్పేడు. ఒక పెద్ద యింజెక్షను గొట్టాన్ని తీసి నాలుగు బుడ్లను పగలగొట్టి గొట్టాన్ని నింపేడు.

"ఇది అహారం నరాలగుండా శరీరంలోకి యెక్కించాలి" అన్నాడు డాక్టరు. ఆ దృశ్యాన్ని చూడలేక తల్లీ భార్యా, అవతలకు వెళ్ళిపోయేరు. శర్మతండ్రి కన్ను సగం మూసుకుంటూ, సగం తెరుచుకుంటూ, చూడలేక చూస్తున్నాడు. డాక్టరుగారు మాత్రం ఏమీ తొణకకుండా మందంతా నరంలోకి యెక్కించేరు.

"ఐస్ తలమీద వేయటానికి వీల్లేదు" అంది తల్లి! జలం కమ్ముతుందని ఆమె భయం. తండ్రి కేకలు వేసేడు. మొత్తం మీద భయపడుతూనే ఐసు ముఖంమీద వేసేరు.

ఆరాత్రి గత రాత్రంత గందరగోళంగా లేదు. శర్మ పేలాపన తగ్గించి అలిసిపోయిన వాడిలాగ కదలకుండా పడుకున్నాడు. తల్లీ తండ్రీ మాత్రం మంచందగ్గరే కూర్చున్నారు.

మర్నాడుదయం డాక్టరుగారు వచ్చి చూసేరు. "జ్వర తీవ్రత తగ్గుముఖం పట్టింది. ఇక పరవాలేదు. పత్యం మాత్రం అతి కఠినంగా చేయాలి. జ్వరం తగ్గటానికి మూడు వారాలు పడుతుంది" అన్నాడు.

"తు. చ. తప్పకుండా మీరు చెప్పినట్టే చేస్తాం" అన్నాడు తండ్రి.

డాక్టరు ఆహారాన్ని మామూలుగా నరంలోకి యెక్కించేడు. తండ్రి భయం లేకుండా దగ్గరనుంచుని చూసేడు.

ఆరోజున అందరి మనస్సులూ స్థిమితపడ్డాయి. మధ్యాహ్నం శర్మ తండ్రి కాలేజీ ప్రిన్సిపాలుగారికి శర్మ టైఫాయిడ్ జ్వరం వచ్చి వళ్ళు తెలియని పరిస్థితిలో వున్నాడనీ, దయచేసి ఒక నెల్లాళ్ళు సెలవు మంజూరు చేయవలసిందని వ్రాసేడు.

ఆనాటి సాయంత్రమే శర్మ అత్తగారు మామగారు, విశాలాక్షి రంగారావు మొదలైన బంధువులు ఒక్కరొక్కరే దిగేరు యెంతో ఆదుర్దాగా - పరిస్థితి కొంత కుదుటపడిందని తెలిసి సంతోషించేరు.

శర్మ క్రమేపీ మనుష్యుల్లోకి వస్తున్నాడు. వచ్చినవారిని గుర్తుపట్ట గలిగేడు. చెప్పినది అర్థం చేసుకుంటున్నాడు. మందులు స్వయంగా అడిగి సక్రమంగా వేసుకుంటున్నాడు.

నాల్గవరోజున కాలేజీవారి దగ్గరనుంచి సమాధానం వచ్చింది.

"శర్మది తాత్కాలికపు టుద్యోగమవటం చేత శెలవు మంజూరు చేయటానికి వీల్లేదని శర్మ కంటే తెలివైన వానిని ఉపయోగించుకోలేకపోయినందుకు కాలేజీవారు విచారపడుతున్నారనీ, అతనికి రావలసిన జీతం లెక్కకట్టి నెలాఖరుకు పంపించి వేయగలమని" రాసేరు. అదునున "వచ్చేయేడు ఏ వేనా ఖాళీలువస్తే శర్మ దరఖాస్తుని సానుభూతితో పరిశీలించగలమని కూడా వ్రాసేరు.

(ఇంకావుంది)


# రత్నపురుషసేవ్యం

(WITH CALCIUM & GOLD)

సువర్ణము మొదలగు భస్మములు చేర్పబడినవి నిశ్శక్తి, నిస్సత్తువ, శుక్లనష్టము, అతిమూత్రము అత్యుష్ణము, గుండెదడ, కాళ్లతీపులు మొదలగు సమస్త మేహములుహరించి బలమును, కాంతిని, పరమున వటుత్వము, అపరిమిత ధాతుపుష్టి నిచ్చును. అనేక యోగ్యతాపత్రములు గలవు.

20 కు డబ్బి రు. 3-12-0 పోస్టేజి 1-0-0

అడ్వాన్సుగా పంపవలెను.

ఇండియన్ మెడిసన్ హౌస్,
లక్ష్మీటాకీసు రోడ్డు - విజయవాడ-2.

# అతిమూత్రవ్యాధి వారం రోజులలో నెమ్మదించును

మూత్రములో అధికముగా చక్కెరపోవుట అతిమూత్రవ్యాధిఅంటారు.(Diabetes) ఇది యెంత ఉపద్రవకరమైన వ్యాధిఅంటే, దీని పాలబడినవారు ఆరోజు కారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు. దీనికి డాక్టర్లు ఇన్సులిన్ ఇన్‌జెక్షన్ మాత్రమే కనిపెట్టారు. వాటివల్ల వ్యాధి పూర్తిగా నయం కానేకాదు. ఇన్‌జెక్షన్ల గుణము వున్నంతకాలము మాత్రం చక్కెర తాత్కాలికంగా నిలిచిపోతుంది. ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి దాహం, ఆకలి, తరచుగా చక్కెరతో మూత్రము బయలు వెడలటము. దురద మొదలైనవి ఈ వ్యాధి ముదిరితే రాచపుండు, కురుపులు, కంటిపొర ఇతర చిక్కులు సంభవించును. వీనస్ ఫారమ్ ఆధునిక శాస్త్రంలో అద్భుతమైన చికిత్స. దీన్ని వాడటం వల్ల సేవకు వేలమంది మృత్యుముఖంనుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజునుండే మూత్రములో చక్కెర తగ్గించి అత్యధికమూత్రము గూడ నివారిస్తుంది. మూడు రోజుల తరువాత మీకు బాగా తెలికయిస్తుంది. దీనికి పత్యం లేదు. ఇన్‌జెక్షన్ల అవసరం లేదు. ఇంగ్లీషులో వివరములుగల కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపుతాము.

60 బిళ్లల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు

ప్యాకింగు పోస్టేజి ఉచితము

వీనస్ రిసెర్చి లేబరేటరీ,

పోష్టుబాక్సు నం. 587, కలకత్తా (A. P. W)

పెద్ద కథ:

# ఉద్యోగాలు

(గతసంచిక తరువాయి)

ఈవిధంగా కాలేజీనుంచి సమాధానం వస్తుందని మొదటే అనుకున్నారు. ఉద్యోగం పోయినట్టు శర్మ చెవిని పడటానికి వీల్లేదని డాక్టరుగారు చెప్పేరు. అంతకు పూర్వమే అందరూకూడా ఆవిధంగా అనుకున్నారు.

"మీ తమ్ముడు ఇటువంటి చిన్న ఉద్యోగానికి పనికిరాడు వాటికి నిర్దేశించబడలేదని అనేకసార్లు చెప్పేను" అన్నాడు రంగారావు

పూర్తి తెలివిరాగానే శర్మ వేసిన మొదటిప్రశ్న ఉద్యోగాన్ని గురించి. ఒక నెలరోజుల శెలవుకు దరఖాస్తు చేసినట్లూ, కాలేజీవారు అనుమతి యిచ్చినట్లు తండ్రి చెప్పేడు.

తల్లిమాత్రం "ఉద్యోగంలేదని పైకి అనకపోయినా మనసులో యెంత బాధ పడిపోయాడో పాపం." అనుకుంది.

పదిరోజుల తర్వాత కృష్ణారావు క్యాంప్ పేరుతో కాలేజీవున్న వూరికే మళ్ళీ వచ్చేడు. ఊళ్ళో పనిమానుకొని కాలేజీకి వెళ్లి "ఫలానా శర్మ అనేవారు వున్నారా?" అని అడిగేడు. అక్కడవారు "శర్మ యెవరో మాకు తెలియదన్నారు. హాస్టలుకు వెళ్ళి విజయసారథిని కలుసుకున్నాడు. అతను శర్మ తనకు కాలేజీలోకాని వూళ్లోకాని యెక్కడా కనబడలేదన్నాడు. బజార్లో కొంతపని పూర్తిచేసుకొని మాథమెటిక్సు లెక్చరర్ రూంకి వెళ్లేడు. ఆయన, శర్మకు టైఫాయిడ్ వచ్చినట్టు అతని తండ్రిదగ్గర నుంచి వుత్తరం వచ్చిందనీ, అతని సెలవు దరఖాస్తు గ్రాంట్ కాలేదని, కాలేజీవారు అతని స్థానంలో ఇంకొకరిని నియమించేరని చెప్పేడు.

కృష్ణారావక్కడ నిలబడలేకపోయేడు. "శర్మ దురదృష్టానికి ఒక హద్దంటూ లేదేమో!" అనుకున్నాడు. వెంటనే వెళ్ళి శర్మని మాద్రాసనుకున్నాడు. ఆ వూళ్ళో మిగిలివున్న కొద్దిపనిని త్వరగా పూర్తిచేసుకొని సాయంత్రం ట్రైనుకు బయలుదేరుదామని వూళ్ళోకి వచ్చేడు

బజార్లో గాంధీచౌక్ దగ్గర రాఘవరావు కనిపించేడు. కృష్ణారావుని చూడగానే సైకిల్ దిగి వచ్చేడు.

"శర్మని ఉద్యోగంలోంచి తీసివేసేరట నిజమేనా?" అన్నాడు. కృష్ణారావుకు వళ్లు మండింది.

"అసలు శర్మకు ఉద్యోగం వచ్చినట్లు నీకెవరు చెప్పేరు?" అన్నాడు కృష్ణారావు.

"శర్మే ఉత్తరం వ్రాసేడు"

"అయితే ఉద్యోగం తీసేసినట్టుకూడా అతనే వ్రాసేడా?"

"లేదు. ఆవిధంగా తెలిసింది"

"నీకు కిట్టనివాళ్ళెవరో ఆవిధంగా చెప్పేరు. శర్మని ఉద్యోగంలోంచి ఎవరూ తీసివేయలేదు. అతనే మానేసేడు" కృష్ణారావు ఈ మాటల్ని కొంచెము తీక్షణంగా అన్నాడు. తర్వాత వెళ్ళిపోయేరు.

కృష్ణారావుకి ఆ సాయంత్రం కంపెనీ వాళ్లదగ్గరనుంచి ఒక టెలిగ్రాం వచ్చింది. ఫలానావూళ్ళో తొందరపని వున్నాయనీ, అక్కడకు వెంటనేవెళ్ళి తర్వాత కంపెనీ హెడ్ క్వార్టర్సుకు రావలసిందనీ వ్రాసేరు. కృష్ణారావు కంపెనీపనిమీద వెళ్ళిపోయేడు.

## జె. పరబ్రహ్మం

శర్మపరిస్థితి రోజురోజుకీ కుదుటపడుతూనే వుంది. మందులు శ్రద్ధగా పుచ్చుకుంటున్నాడు. ఎంతత్వరగా తగ్గితే అంత త్వరగా కాలేజీకివెళ్ళి చేరవచ్చునని అతని ఆశ. తనకు నెలరోజులు శెలవు యిచ్చేరని తండ్రి చెప్పేడు. తను నమ్మేడు. వచ్చిన బంధువులు క్రమక్రమంగా వెళ్ళిపోయేరు. శర్మకు పూర్తిగా నెమ్మదించింది. పథ్యం పుచ్చుకున్నాడు.

తర్వాత ఉద్యోగంసంగతి శర్మకుచెప్పక తప్పిందికాదు. అతను చాల విచారించేడు. తన కాసంగతి యింతవరకూ యెందుకు చెప్పలేదన్నాడు.

"నీకుచెప్పినా చెప్పకపోయినాఒక్కటే. నీవు తెలిసికొని చేయగలిగేదేమిటి?" అన్నారు.

"నువ్వు నాలుగైదునెలలు విశ్రాంతి తీసుకుంటే కాని తేరుకోలేవు. వచ్చేయేటికి ఆ కాలేజీలోనే కాళీ వస్తుందట. దానికి నువ్వు ప్రయత్నం చేయవచ్చు. ఈలోగా చెడిపోయిందేమీలేదు" అన్నారు.

తర్వాత శర్మ ఉద్యోగంసంగతి యెవరూ యెత్తలేదు. అప్లికేషన్సు పెట్టుకోమనికాని, వద్దనికాని సూచనలపోలు ఇయ్యలేదు.

ఒక నెలరోజులు గడిచేయి. జ్వరం తగ్గిన తర్వాత శర్మకు ఆకలి యెక్కువైంది. తల్లీ, భార్యా, అతని ఆరోగ్యవిషయమై ప్రత్యేకమైన శ్రద్ధ చూపిస్తున్నారు. పాలు పళ్లు మొదలైన పుష్టికరమైన ఆహారం వేళ తప్పకుండా సక్రమంగా అతనికి యిస్తున్నారు. మొత్తంమీద ఈ నెలరోజుల్లోనూ పూర్వంకంటే ఆరోగ్యకరమైనస్థితిలోకి వచ్చేడు.

కృష్ణారావు యింతవరకూ యింటికి తిరిగి రాలేదు. జీతాలందగానే నెల మొదటి వారంలో తప్పకుండావచ్చేవాడు. ఇంటికి నెలకు సరిపోయే వస్తువులన్నీ కొని మళ్లీ వెళ్ళిపోయేవాడు, ఈసారి అతనిదగ్గరనుంచి మనియార్డరు మాత్రమే వచ్చింది. ఇంకొక రాష్ట్రంలో పనిచేసే ఏజంటును కంపెనీ డబ్బు దుర్వినియోగం చేసేడని తొలిగించి ఆ పనిని కూడా కృష్ణారావునే చూడమన్నారు. దానికి బదులుగా తర్వాత నెలలో పదిహేనురోజులు శెలవు వినియోగపరచుకోవచ్చునని తెలియజేసేరు. ఈ సంగతులు ఇంటికి ఉత్తరంద్వారా తెలియ

సకల దంత వ్యాధులకు
కోతిమార్కు
నల్లపండ్లపొడి

ప్రతిచోట దొరకును.
నోగి అండ్ కో
87 బ్రైనాబజార్ రోడ్, మద్రాసు-1
బెజవాడ స్టాకిస్టులు: ట్రేడ్ ప్రమోటింగు కార్పొరేషన్, పోస్టుబాక్సు నెం. 60 గాంధీనగరం.

# ★ ఉద్యోగాలు ★

జేస్తూ శర్మకు స్త్రీవివరాలు కంపెనీ ఎడ్రస్సుకు వ్రాయవలసిందని వ్రాసేడు.

ఒకరోజున శర్మ వారియింటికి వెళ్లేడు. వారు ఈ వివరాలు చెప్పేరు. ఇంకొక పది రోజుల్లో కృష్ణారావు రావచ్చుననికూడా చెప్పేరు. శర్మ తన యం. ఏ. పుస్తకాలు చదువుకుంటూ ఆ పది రోజులూ గడిపేడు.

ఒకరోజున కృష్ణారావు వచ్చినట్లు వాళ్ల పెద్దబ్బాయి కనబడి చెప్పేడు. శర్మ వాళ్లింటికి వెళ్ళేడు.

"నేను వచ్చినట్టు యెల్లాగ తెలిసిందీ? నేనే వద్దామనుకుంటున్నాను" అన్నాడు.

"మీవాడు చెప్పేడు" అన్నాడు శర్మ. తర్వాత తన్ను రైల్లో యెక్కించింది లగాయతు అప్పటివరకూ జరిగినవన్నీ శర్మ చెప్పేడు.

కృష్ణారావు కూడా తనకూ రాఘవరావుకు జరిగిన సంభాషణా, తన ఇతర క్యాంప్ విశేషాలు చెప్పేడు. తనకు పదిహేనురోజులవరకూ ఇక యెక్కడకూ వెళ్లక్కర్లేదన్నాడు.

ఒక రోజు వుదయం కృష్ణారావు వచ్చి "నిన్న సాయంత్రం రాఘవరావు వచ్చేడు" అన్నాడు.

"విశేషమేమన్నా వుందా? లేక వూరికేనే వచ్చేడా?"

"వాడు రావటంలో ప్రత్యేకమైన విశేషమేమీ లేదుకాని మనిషిలో మాత్రం విపరీతమైన మార్పొంది. ఇప్పుడు పూర్వంలాగ లేడు. అహంభావం పూర్తిగా తగ్గినట్టుంది. వెటకారంగా కాకుండా మనసిచ్చి మాట్లాడుతున్నాడు. మాట్లాడుకు నేందుకు సాయంత్రం మా యింటికి వస్తానన్నాడు. ఒక వారం రోజులు శెలవు పెట్టేడట" అన్నాడు కృష్ణారావు.

సాయంత్రం ముగ్గురు మిత్రులు కృష్ణారావింటిదగ్గర చేరేరు. రాఘవరావు ఉద్యోగంలో చేరటానికి పూర్వంవున్న అహంభావం, హుషారు చాలభాగం అణగారిపోయేయి. జబ్బుచేసి తేరుకున్న శర్మకంటె యెక్కువగా చిక్కిపోయివున్నాడు. అతని వేషంలో మాటల్లో యెంతో సంస్కారం వచ్చినట్లు కనపడింది.

గత పదిహేను సంవత్సరాల్లోనూ, హైస్కూలు చదువుకానీ, కాలేజీ చదువుకాని తీసుకురాలేని ఈ గొప్ప మార్పును తెచ్చిన మహత్తర శక్తి తాలూకా ఆఫీసు ఉద్యోగానిదే అనటంలో యెంతమాత్రం సందేహం లేదు.

చదువుకునే రోజుల్లో అతను సాధిం

చింది యేమీ లేకపోయినప్పటికీ అతని గర్వానికి పోకిరితనానికీ ఒక హద్దుండేది కాదు. అతనిచే అవమానింపబడని ఉపాధ్యాయుడు కాని, అతను యెదిరించని లెక్చరర్ గానీ లేడు. ఒకరిచే ఆజ్ఞాపించబడటం కానీ, ఒకరు తనకంటే యెక్కువ అన్న భావాన్ని కానీ అతను సహించలేక

పోయేవాడు. క్లాసులో ఒకగంట కూర్చునే ఓపికగానీ, క్రమశిక్షణగాని అతనిలో యే కోశానాలేవు. అతను విజయవంతంగా కాపీకొట్టనిపరీక్ష లేదు. అటువంటి రాఘవరావుని తాలూకా ఆఫీసు ఉద్యోగం మూడు నెలల్లో పూర్తిగా లొంగదీసింది.

మొదటి రోజున సూటు, హేట్, నెక్టయిలతో నిండుగా ఆఫీసుకు వెళ్లేడు. అందరి చూపులూ అతనిమీదనే పడ్డాయి. ఈ వుద్యోగానికి ఈ వేషం తగదనుకున్నాడు.




ప్రతి బిందువూ లెక్కలోకి వచ్చేదే

బాగా నీరుశక్తి, మంచి విత్తనాలు ఉన్నితే పుణ్యభూమి పుష్కలంగా పండుతుంది.

మీ సదుపాయం, భావిసంతతి సదుపాయం నిమిత్తం

**సొమ్మును పొదుపుచేసి పెట్టుబడి పెట్టండి**

హామీగల ఈ క్రింది సెక్యూరిటీలపై:

| | |
|---|---|
| నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్లు | రు. 100 పెట్టుబడికి 12 సంవత్సరాలలో రు. 150/. లభింపగలదు. |
| పది సంవత్సరాల ట్రెజరీ సేవింగ్స్ డిపాజిట్లు | సాలీనా 3½% వడ్డీ చెల్లింపు: 10 సంవత్సరాలు మూలధనానికి భద్రత. |
| పోస్ట్ ఆఫీసు సేవింగ్స్ బ్యాంకు డిపాజిట్లు | రు. 10,000/. వరకు డిపాజిట్లపై 2% వడ్డీ చేర్చబడుతుంది. (జాయింట్ అక్కౌంట్ల విషయంలో రు. 20,000/. వరకు డిపాజిట్లపై.) |

లభించే వడ్డీపై భారతీయ ఆదాయపు పన్ను ఉండదు.

పొదుపు చేసిన స్వల్పాదాయంనుండి అధిక సౌకర్యాలు

**ఈ గొట్టపు నూతులు**

**హెచ్చుభూములను సాగుచేసి అధికాహారాన్ని ఒసగుతాయి**

ఇంకా ఇతర వివరాలకు, లేక/మరియు ఈ పెట్టుబడులను గురించిన నిబంధనలకై నేషనల్ సేవింగ్స్ కమిషనర్ పేరట గోర్టన్ కాజిల్, సిమ్లా-3, విలాసానికిగాని, మీ రాష్ట్రంలోని రీజనల్ నేషనల్ సేవింగ్స్ ఆఫీసరుకు గాని వ్రాయండి.

A.C. 813 16

# ★ ఉద్యోగాలు ★

రెండవ రోజున ఆలస్యంగా వెళ్ళేడు. ఆఫీసరు చివాట్లు వేసేడు. ఎదిరించడానికి అతను ఉపాధ్యాయుడు కాడు. లెక్చరర్ దృష్టిని తప్పించుకొని క్లాసునుండి జారుకొని పోవటంలో అతనికి ప్రత్యేకమైన నేర్పరితనముంది. ఆ నేర్పరితనం ఇక్కడ యెంతమాత్రం పనిచేయలేదు. అతని దస్తూరికి, పనికి, నడతకి, వేషానికి చివాట్లుతినని రోజేలేదు. అంతకంతకూ ఆఫీసు ఒక నరక కూపంలాగ కనబడుతోంది. తప్పించుకునే ఉపాయం లేదు. చివరకు ఒకరోజున తాసిల్దారును యెదిర్చి ఒక బ్లాక్‌మార్కును కూడా సంపాదించుకున్నాడు.

అతనికి పది పుష్కరాలకుకూడా ప్రమోషను వచ్చే సావకాశం కనపడలేదు. తనవంటి బి. యే.లు పెస్టులు ప్యాసైనవారు అసంఖ్యాకంగా వున్నారు. వారిలో చాల మందికి తలలు కూడా నెరిసేయి. వారింత వరకూ గుమాస్తాలుగానే వున్నారు. ఇంత మందిని తప్పించి తనకు ప్రమోషను ఇవ్వటానికి తనలోవున్న ప్రత్యేకత యేమిటి? తనకు ప్రమోషను రావటం అసాధ్యమని తెలుసుకోవటానికి అట్టే కాలం పట్టలేదు. ఇక తాసిల్దారు అన్నది తనకు ఆసించటానికి కూడా వీలులేని పదవి. దానితో పొంగిపోయే గర్వం పూర్తిగా అణిగిపోయింది.

"ఉద్యోగం యెల్లాగ వుందిరా బ్రదర్" అన్నాడు కృష్ణారావు.

"ఏం వుద్యోగం రా, గతిలేనివాళ్లు చేయవలసిన పనికాని" అన్నాడు రాఘవరావు.

"ఏమిరా అంత నీరసంగా మాట్లాడుతున్నావు? పట్టుమని అయిదేళ్ళు కళ్లుమూసుకుని కూర్చున్నావంటే ఇట్టే ప్రమోషను వచ్చి మీదపడుతుంది. డిప్యూటీ కలక్టరై కూర్చుంటావు" అన్నాడు కృష్ణారావు.

"అటువంటి సావకాశాలు భూతద్దంపెట్టి వెదికినా కనబడటంలేదు. నాకంటె సీనియర్లు అయిదువందలమంది పెస్టులు ప్యాసై ప్రమోషన్లకోసం రెడీగా కూర్చొని వున్నారు. ఇక మన కెక్కడ వస్తుంది" అన్నాడు రాఘవరావు.

"తాలూకా ఆఫీసు గుమాస్తా గిరీ అంటే బానిసత్వమేరా. ఆత్మాభిమానం వున్నవాళ్ళెవరూ అందులో చేరకూడదు" అన్నాడు మళ్ళీ.

కృష్ణారావు అసలు ప్రసంగంలోకి దిగేడు.

"నీ ఉద్దేశంలో క్రమశిక్షణ అంటె బానిసత్వం. నీ మనస్తత్వం నాకు చిన్నప్పటనుంచీ తెలుసు. ఒకరిని గౌరవించటం కానీ, ఒక గంట పట్టుమని పుస్తకందగ్గర కూర్చోవటం కాని, వేళకు స్కూలుకు రావటం కాని, గంట అయ్యేవరకూ స్కూల్లో కూర్చోవటంకాని నీకు చేతకావు. నే నీ మాట లంటున్నానని కోప్పడకు. నువ్వు గుమాస్తాగా చేరిన రోజునే తెలుసు నువ్వా పని చేయలేవని. కొర్మలాంటి వారు చదువుకునే రోజుల్లోనే వినయం క్రమశిక్షణ మొదలైనవి అలవర్చుకున్నారు. వారికి ఈ గుమాస్తా వుద్యోగం ఒక లెక్క కాదు. వారికి ఎటువంటి వుద్యోగం వచ్చినా సమర్థతతో చేసి అధికారుల మెప్పు సంపాదించగలరు. నువ్వు అధికారులచేత రోజూ చివాట్లు తింటున్నావని నాకు తెలుసు. ఆ అధికారులుకూడా నీవంటివారే అయి వుంటారు. కారణమేమంటే ఈరోజుల్లో విద్యార్థిదశలో మంచిజీవితానికి కావలసిన అలవాట్లు నూటికి ఒకరిద్దరుతప్ప యెవరూ నేర్చుకోవటంలేదు. అందుచేత పని మానిచేయటానికి నీవు వేసేయెత్తులు వారికికూడా తప్పనిగా తెలుసు. అయితే వారు నీకంటె ముందు ఉద్యోగంలో ప్రవేశించటంచేత నీలాగే మొదట్లో బాధపడినా కొంత



కాలంలో క్రమశిక్షణకు అలవాటు పడ తారు. అంతే తేడా" అన్నాడు.

రాఘవరావు యేమీ మాట్లాడ లేక పోయేడు. కారణమేమంటే కృష్ణారావు మాటలాడేదాంట్లో కొంతవరకూ నిజం లేక పోలేదు. తను రోజూ తిట్లు తింటున్నట్టు కూడా తెలుసుకున్నాడు. అవులిస్తే పేగులు లెక్క పెట్టేటట్టున్నాడు.

"కృష్ణారావు మళ్ళీ ప్రారంభించేడు."

"నీవేమీ అధైర్యపడక్కర్లేదు. నువ్వు ఏవిషయాల్లో కొరతగా వున్నావో అవి నేర్చుకునేందుకు ప్రయత్నించు. అదృష్టం కలిసివస్తే నీకూ, నీ అధికారులలాగే ప్రమోషను వస్తుంది. కానీ పూర్వపుపద్ధతులలోనే నిలదొక్కుకోవటానికి ప్రయత్నిస్తే యెంత అదృష్టమున్నా పైకి రావటం అసంభవం - నేనుకూడా నీలాగే క్లాసులో అల్లరిచేస్తూ వుండేవాడిని. అయితే నేను చేసేది అల్లరనీ, అది తప్పనీ నాకు తెలుసు. అది నీకు తెలియదు. నా తప్పుని అదుపులో పెట్టుకోగల శక్తి నాకుంది. నీకులేదు. శర్మకు అసలు అటువంటి బుద్ధే లేదు. అందుచేత మనం ముగ్గురం ఒకేక్లాసులో ప్రవేశించినా జీవితాలు మూడు రకాలుగా వెడుతున్నాయి. ఈరోజునే చెపుతున్నాను శర్మ మన యిద్దరికంటె చాల పెద్ద వుద్యోగంలోకి వెడతాడని."

ఈఉపన్యాసానికి రాఘవరావు మాట్లాడలేకపోయేడు. శర్మ ఆశ్చర్యపోయేడు.

కొన్ని రోజులకు రాఘవరావు ఆ తరువాత కృష్ణారావు వారి ఉద్యోగపు పనుల మీద వెళ్ళిపోయేరు.

ఒకరోజున యూనియన్ పబ్లిక్ సర్వీసు కమీషనువారివద్దనుంచి హాల్ సర్టిఫికేటు మొదలైన కాగితాలు వచ్చేయి. అయితే వాటిసంగతి యింట్లో యేమీ ప్రస్తావించలేదు. తనేదో ఉద్యోగపు ప్రయత్నంమీద మెడ్రాసువెళ్ళవలసివుందనిమాత్రంచెప్పేడు.

"ఈ యేడు మనకేమీ కలిసిరావటంలేదు అందుచేత ప్రయత్నాలు ఈ యేటికి మానటం మంచిది." అని యింట్లో వారు సలహా యిచ్చేరు.

"మెడ్రాసు వెళ్ళడం తప్పుకుండదగ" అన్నాడు శర్మతండ్రి.

"మనం చేసే దండగల్లో యిదొకటి" అన్నాడు శర్మ.

ఆరోజు రాత్రి శర్మ భోజనం మానివేసేడు. తల్లి యేదోవిధంగా తండ్రిని వొప్పించే బాధ్యత తనమీద వేసుకుంది. రాజ్యం పుట్టింటినుండి తెచ్చుకున్నవి తన దగ్గరవున్నవి కలిపి యాభైరూపాయలవరకూ వున్నాయి. అవి తీసుకుని శర్మ మెడ్రాసు వెళ్ళేడు. వెళ్ళేముందర తను ఫలానా పరీక్షకు వెడుతున్నట్టు యింటిదగ్గర చెప్పటం మంచిదేమో అనుకున్నాడు. కాని తల్లి తండ్రులకేమిచెప్పినా ఒకగంటలో ఆవార్త వూరివారందరకూ తెలిసిపోతుంది. తను ఐ. ఏ. ఎస్ పరీక్షలకు వెడుతున్నట్టు వారెవరికీ తెలియటం తనకు యిష్టంలేదు. తను పరీక్షకు సరిగా ప్రయత్నం చేయలేదు. "ఫలితాలు మనచేతిలో లేవు. ప్రతివారి దృష్టిలోనూ పడటం అనవసరం" అనుకున్నాడు.

మెడ్రాసులో మొదటిరోజున పరీక్ష హాలువద్ద మేథమెటిక్సు లెక్చరర్ కనిపించేడు. తర్వాత తన హోటలు రూం వదలి ఆ లెక్చరర్ వున్న హోటల్లోనికే తన బసను మార్చివేసేడు. పేపర్లు తను అనుకున్న దానికంటె బాగానే వ్రాశాడు. ప్రశ్నలు యేమంత కఠినంగా లేవనుకున్నాడు. మెడ్రాసులోవుండగా ఉద్యోగ ప్రయత్నాలమీదవున్న అనేకమంది యువకులు కనపడ్డారు. వారి ప్రవర్తనలు చూసి "కృష్ణారావు చెప్పినది అక్షరాలా నిజం. వీరిలో చాలామందికి నడతలో యెటువంటి శిక్షణా లేదు. వీరు యే వుద్యోగాలలో ప్రవేశించినా దేశానికి ప్రమాదమే. నిరుద్యోగసమస్య తీవ్రమౌతోందని ప్రభుత్వాన్ని నిందించి ప్రయోజనంలేదు. పనికి రాని వారందరకూ రెండింగ్లీషుముక్కలు నేర్చుకున్నారన్న కారణంతో ఉద్యోగాలివ్వటం ప్రభుత్వం పనికాదు. విద్యార్థిదశలోనే వీరికి సరియైన శిక్షణ యిచ్చే బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించాలి" అనుకున్నాడు.

ఇంటికి జేరిన తర్వాత "ఉద్యోగప్రయత్నాలు యేమైనాయి" అని తల్లీ భార్యా అడిగేరు. తండ్రి యేమీ కలుగజేసుకోలేదు. శర్మమాత్రం చాలా ఉత్సాహంగా వున్నాడు.

"ఉద్యోగం వచ్చేదీ రానిదీ ఇప్పుడప్పుడే తెలియదు. వారు తర్వాత తెలియజేస్తారు. బహుశా నన్ను మళ్ళీ పిలుస్తారనుకుంటాను" అన్నాడు.

తర్వాత కృష్ణారావు ఆ వూరు వచ్చినప్పుడు శర్మ తన మెడ్రాసు ప్రయాణం గురించి పరీక్షల్ని గురించీ చెప్పేడు. మెడ్రాసులో మేథమేటిక్స్ లెక్చరర్ కనపడ్డారనీ తనకు యెంతో సహాయం చేసేడనీ చెప్పేడు. తర్వాత అనుకున్నట్టుగా ఎభై రూపాయలు తిరిగి ఇవ్వలేకపోయానని వీలుచూసుకొని యిచ్చివేయగలనని చెప్పేడు.

"నీకు కలెక్టరుద్యోగం రాకపోదు. నేను నీదగ్గర తీసుకోకమానను. నువ్వు కంగారు పడక్కర్లేదు" అన్నాడు.

రెండు మూడు నెలలు గడిచేయి. ఒకరోజున ఐ. ఏ. ఎస్ పరీక్షకు ఇంటర్వ్యూ నిమిత్తమై రావలసిందని ఆహ్వానం వచ్చింది. ఆహ్వానం వచ్చేటప్పటికి శర్మ యింటిలో లేడు. కార్డు శర్మ తండ్రి చేతిలో పడింది. ఆయన చూసి ఆశ్చర్యపోయేడు. తనలో నవ్వుకున్నాడు. ఈ సంగతి తనతో చెప్పకూడదా? చెప్పిన తను వద్దంటాడా?

ఇంతలోకే శర్మ వచ్చేడు. తను ఐ. ఏ. యస్. పరీక్షలకు వెడుతున్నట్టు యెవరికీ తెలియటం తన కిష్టంలేదన్నాడు. "ఇంటిలోని వార్తలు ఇంటిలోనే వుండక వూరంతా ప్రాకిపోయే పరిస్థితు లిక్కడ వున్నాయి. రాఘవరావుకు గుమాస్తా వుద్యోగం రాగానే డిప్యూటీ కలక్టరైనట్టు

(43-వ పేజీ చూడండి)


# అతిమూత్రవ్యాధి వారం రోజులలో నెమ్మదించును

మూత్రములో అధికముగా చక్కెరపోవుట అతిమూత్రవ్యాధిఅంటారు.(Diabetes) ఇది యెంత ఉపద్రవకరమైన వ్యాధిఅంటే, దీనిపాలబడినవారు ఆరోజు కారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు. దీనికి డాక్టర్లు ఇన్సులిన్ ఇన్జెక్షన్ మాత్రమే కనిపెట్టారు. వాటివల్ల వ్యాధి పూర్తిగా నయం కానేకాదు. ఇన్జెక్షన్ల గుణము వున్నంతకాలము మాత్రం చక్కెర తాత్కాలికంగా నిలిచిపోతుంది. ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి దాహం, ఆకలి తరచుగా చక్కెరతో మూత్రము బయలు వెడలటము. దురద మొదలైనవి ఈ వ్యాధి ముదిరితే రాచపుండు, కురుపులు, కంటిపొర ఇతర చిక్కులు సంభవించును. వీనస్ ఛారమ్ ఆధునిక శాస్త్రంలో అద్భుతమైన చికిత్స. దీన్ని వాడటం వల్ల వేనకు వేలమంది మృత్యుముఖంనుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజునుండే మూత్రములో చక్కెర తగ్గించి అత్యధికమూత్రము గూడ నివారిస్తుంది. మూడు రోజుల తరువాత మీకు బాగా తేలికయిస్తుంది. దీనికి పత్యం లేదు. ఇన్జెక్షన్లు అవసరం లేదు. ఇంగ్లీషులో వివరములుగల కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపుతాము.

50 బిళ్ళల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు

ప్యాకింగు పోస్టేజి ఉచితము

వీనస్ రిసెర్చి లేబరేటరీ,

పోస్టుబాక్సు నం. 587, కలకత్తా (A. P. W)

# ఉద్యోగం

(27-వ పేజీ తరువాయి)

ప్రచారం జరిగింది. అటువంటివి నాకు కిట్టవు" అన్నాడు శర్మ.

తర్వాత తను అప్లికేషనుఫీజు నిమిత్తమై కృష్ణారావుదగ్గర అప్పుచేసినట్లు చెప్పి ఐ. ఏ. యస్. వార్తను యెవరితోనూ చెప్ప వద్దన్నాడు. తండ్రి 'సరే' అన్నాడు.

ఆనాడు సాయంత్రం తండ్రి శర్మకు రెండువందల రూపాయలు ఇచ్చి కృష్ణారావు బాకీ తీర్చివేసి మిగిలిన డబ్బుపెట్టి ఖరీదైన సూటు కుట్టించుకోమన్నాడు. ఈ సలహాను కృష్ణారావు అనేకసార్లిచ్చేడు. శర్మ ప్రక్కనవున్న బస్తీకి వెళ్ళి ట్వీడ్ సూటు కొకదానికి ఆర్డరిచ్చేడు. మంచి రంగులుగల నెక్టైయి, బూట్లు సాక్సుకూడా కొని తెచ్చుకున్నాడు. ఇంటికి రాగానే తండ్రి 'అవి చాలా బాగున్నాయి' అన్నాడు.

తండ్రి కొడుకుల ప్రవర్తన ఇంటిలో వారికి కొంత ఆశ్చర్యం కలిగించింది. శర్మకేదేనా పెద్ద వుద్యోగం వచ్చిందేమో అనుకున్నారు. రాలేదని శర్మ చెప్పేడు.

అయితే ఈ ఖర్చులు, ఈ వేషాలు యేమిటీ?" అని అడిగింది రాజ్యం.

"ఉద్యోగప్రయత్నాలు" అన్నాడుశర్మ.

ఇంటర్వ్యూకి వెళ్ళవలసిన సమయం వచ్చింది. ఇంటర్ క్లాసులో ప్రయాణం చేయమనీ, అన్ని వసతులూగల పెద్ద హొటలులోమాత్రమే మకాం చేయవలసిందని తండ్రి సలహా యిచ్చేడు. "సరే" నన్నాడు శర్మ. మిగతావారు శర్మ ఉద్యోగంకోసం గట్టిప్రయత్నాలు చేస్తున్నాడనుకున్నారు.

ఇంటర్వ్యూకి లెక్కల లెక్చరర్ రాలేదని శర్మకు తెలిసింది. వెనకటి అనుభవాన్ని పురస్కరించుకొని ఈసారి సమాధానాలు యేమి తొణకకుండా చెప్పేడు. మొత్తం మీద ఇంటర్వ్యూని జయప్రదంగా ముగించుకుని యింటికి చేరేడు.

ఒకరోజున ట్వీడ్‌సూట్ నెక్టయి మొదలైనవి ధరించి తన గదిలో కూర్చున్నాడు. రాజ్యంచూసి "ఈ వేషంలో మీరొక జిల్లా కలక్టరులాగ వున్నారు" అంది.

"అట్లాగయితే ఎప్పుడూ ఈవేషంలోనే వుండదల్చుకున్నాను" అన్నాడు శర్మ.

ఐ. ఏ. యస్ లో శర్మకు మూడవ ర్యాంక్ వచ్చింది. ఈ వార్త ఒక అరగంటలో వూరంతా వ్యాపించి పోయింది. "శర్మ చాలా తెలివైనవాడని మాకు మొదటి నుంచీ తెలుసు, ప్రతీక్లాసులోనూ ఫస్టుగా వుండేవాడు" అన్నారు. "అతను అమాయకుడు" అన్నవాళ్ళు "అతను చాల బుద్ధిమంతు"డన్నారు. మొత్తంమీద శర్మలో ఏవేనా చిన్నచిన్న లోపాలుంటే అవన్నీ సద్గుణాలుగా మారిపోయేయి.

శర్మ తండ్రి ఉత్సాహానికి హద్దు లేదు. శర్మతల్లి "నేను చెప్పలేదూ, మనవాడికి పెద్ద ఉద్యోగం వస్తుందనీ" అంది.

"ఏదో పైకి అట్లాగ అన్నాను కానీ నాకు మాత్రం తెలియదా యేమిటి?" అన్నాడు తండ్రి.

"అయినా మీ డబ్బు వాడికి అచ్చిరాలేదు. పరీక్షకి వెళ్ళటానికి రాజ్యందగ్గర నాదగ్గరా కలిపి యాభైరూపాయలు వుంటే యిచ్చి పంపించేం" అంది తల్లి.

ఏమి అన్నా తండ్రికి సంతోషంగానే వుంది.

అందరూ తలోసారీ కరణంగారియింటికి వెళ్ళి వచ్చేరు. అయితే కరణంగారియింట్లో యెవరినీ చూడటానికి వీల్లేకపోయింది.

ఎటువంటి వార్తలూ లోనికి ప్రవేశించటానికి వీల్లేదు అన్నట్టుగా వారి వాకిలి తలుపులు ఆరోజంతా బంధింపబడి వున్నాయి.

కృష్ణారావు హోటల్ లో కాఫీ సేవిస్తూ ఐ. ఏ. యస్ ఫలితాలు చూసేడు. శర్మ పేరు మూడవ ర్యాంకు లో కనబడగానే త్రాగుతూవున్న కాఫీని వదిలేసి ఊళ్లో వున్న రాఘవరావు యింటికి పరుగెత్తుకుని వెళ్లేడు. రాఘవరావు ఆఫీసుకు వెళ్లినట్టు ఇంటోంచి యెవరో చెప్పేరు. కృష్ణారావు ఆఫీసుకు వెళ్లేడు. రాఘవరావు కుర్చీ లో కూర్చుని ఫైళ్లు తిరగేస్తున్నాడు. ఈవార్తని చెప్పేడు. రాఘవరావు ఈ వార్తని యింతకు ముందే పేపర్లో చూసేడు.

"శర్మకు ఐ. ఏ. యస్ లో సెలక్షను వచ్చింది" అన్నాడు కృష్ణారావు.

"ఏ శర్మ?"

"ఏ శర్మో అయితే నాకెందుకూ? మన శర్మ"

"వాడెప్పుడూ ఐ. ఏ. యస్ పరీక్షకు వెడుతున్నట్టు నాతో చెప్పలేదే?"

"నువ్వు పబ్లిక్ సర్వీసు కమీషనుకు వెళ్లినప్పుడు శర్మతో చెప్పేవు గనక నా ? వాడెందుకు చెప్పాలి?"

"అప్పుడు నేను చెప్పక పోవడమే అతనికి లాభం. లేకపోతే నాలాగే గుమాస్తాగా తయారయ్యేవాడు.

"వాడు నీకు చెప్పక పోవటం కూడా నీకు లాభమే. రెండువందల రూపాయలు నీకు మిగిలేయి."

తాసిల్దారు వచ్చేడు. అందరు గుమాస్తాలలాగే రాఘవరావుకూడా లేచినించున్నాడు. రాఘవరావు అతికష్టంమీద నవ్వు తెచ్చుకుని తన ప్రియమిత్రుడొకడు ఐ. ఏ. యస్ మూడవ ర్యాంకులో ప్యాసైయ్యేడని చెప్పేడు. ఆఫీసరు నవ్వి "అయితే బాగానే వుంది. మీ మిత్రుడు యెప్పుడో మనకు పై అధికారిగా వస్తాడన్నమాట!" అన్నాడు.

"ఇక్కడికే రావాలనేముందిలెండి. దేశం మొత్తంమీద యే రాష్ట్రంలో నైనా వేయవచ్చు" అన్నాడు రాఘవరావు.

"మొదటి పది ర్యాంకుల్లో వచ్చినవారిని వారు కోరుకున్న రాష్ట్రాల్లోనే వేస్తారు" అన్నాడు ఆఫీసరు.

రాఘవరావు గుండెల్లో రాయిపడింది. భూకంపంవచ్చి సీటు కదిలిపోతుందా అనిపించింది. ప్రక్కనున్న కృష్ణారావునిచూసి "ఉద్యోగాలు సుడిగుండాలు ఒకసారి ఒకరిది పైచేయీ మరొకసారి యింకొకరిది పైచేయీ అవుతుంది" అన్నాడు రాఘవరావు.

"అంతేకాని మన విద్యార్థి జీవితంలోని మన ప్రవర్తనకు ఇదొక ప్రత్యక్షమైన శిక్ష అని గ్రహించలేకపోయేవన్న మాట!" అన్నాడు కృష్ణారావు.

"భేష్" అన్నాడు ఆఫీసరు. రాఘవరావు తప్ప అందరూ నవ్వేరు.

సమాప్తం.

## గ్రంథ ప్రకాశం

### అక్కడక్కడ

ఖండకావ్యము; రచయిత సేనాపతి రామాచార్యః పరిష్కర్త వానమామలై లక్ష్మణాచార్య కవి; వెల 1-0-0; సుహృదులకు ప్రత్యేకమైన వెల 2-0-0; ముద్రణ శ్రీరామా పవర్ ప్రెస్ 1877-79 సాండర్స రోడ్, సికిందరాబాదు (ద).

### సవిహార కుమార సందేశము

పద్యకావ్యం; శ్రీ నారాయణ పండితాచార్యుల వారి "సంగ్రహ రామాయణ" మందలి సుందరకాండమునకు బక్షీ వాసుదేవరావుగారి ఆంధ్రీకరణము. వెల 1-8-0. ప్రతులకు బి. వాసుదేవరావు; ఛత్రపూర్ (గంజాం జిల్లా).

### ఇంజక్షను విధానము

గ్రంథకర్త: వైద్యవిద్వాన్ దూబగుంట సుబ్రహ్మణ్యం; వెల 1-8-0; ప్రతులకు ఇండియన్ మెడిసిన్ హౌస్, బకింగ్ హాం పేట, విజయవాడ. ఆయుర్వేద పద్ధతికి సంబంధించిన ఇంజక్షనులను ఇచ్చే విధానము ఆయుర్వేద వైద్యులకు ఉపయుక్తంగా ఉండేటట్లు వివరింపబడింది.